# అగ్నిసుధ

సుధామ



సుధామ

కవిత

# అగ్నిసుధ

సఖీకుమారి ప్రచురణలు
16-11-310/9/1,
సలీంనగర్ కాలనీ, మలక్ పేట
హైదరాబాదు-36

# AGNI SUDHA
Poetry in Telugu

By
SUDHAMA

First Edition, 1000 Copies
25th Nov, 1990

Cover Design
SEELAVI

Printed by
SRI BALAJI ART PRINTERS
Municipal Market, Chikkadpally,
Hyderabad-500 020

For Copies :
Smt. S. V. LAKSHMI BAI
SAKHI KUMARI PRACHURANALU
16-11-310/9/1, Saleemnagar Colony,
Malakpet, Hyderabad-500 036

Or

Smt. A. RAJESWARAMMA
C-93, Dayal Nivas,
Vanasthalipuram,
Hyderabad-500 661

Price : 20/-

మా

నాన్నగారు

కీ. శే. అల్లంరాజు కామేశ్వరరావు గారికి

# ఇప్పటికి....

చాలాకాలంగా కవిత్వం రాస్తున్నా నా కవితలను ఓ సంకలనంగా వేయలేదు. 1983లో జాతీయ కవి సమ్మేళనానికి ఢిల్లీ వెళ్ళినప్పుడు, నా కవితను హిందీలో అనువదించిన కవిగారు తన గ్రంథాలు ఓ అరడజనుకు పైగా ఇచ్చి అచ్చయిన నా పుస్తకాలు ఇమ్మన్నప్పుడు, మొదటిసారి 'పుస్తకరూపంలో నా కవిత లేదే' అని అనిపించింది.

ఓ మాటు నా కవిత నొకదానిని ఎవరి కవితకో అనుకరణగా ఓ విమర్శకుడు ఆరోపించినప్పుడు పుస్తకప్రచురణ ఆవశ్యకత మరీ తెలిసివచ్చింది. రచించిన తరువాత ఏడాదికిపైగా కాలం గడిచాక అచ్చుకు పంపినవీ, పత్రికల్లో ప్రచురింపబడినవీ కవితలున్నాయి. కొన్ని కవితలు ప్రసారానికి వినియోగించినవి. నేను రాసిన తరువాత అదే భావసారూప్యం గల ఇతరుల కవితలు ముందుగా అచ్చులో రావడం, గ్రంథస్థం కావడం జరిగితే నా భావాలు బింబ ప్రతి బింబాలుగా భావిస్తే ఎలా? భావసారూప్యం సాహిత్య ప్రపంచంలో కనిపిస్తూనే వుంటుంది. ఎప్పటికప్పుడు పుస్తకరూపంలో వెలువడి రచనాకాలం ఋజువు పరచుకుంటేనే కొన్ని అపార్థాలూ, ఆరోపణలూ తొలగిపోతాయి.

1974లో 'మేం' అని కవితా సంకలనం అచ్చయింది. డా॥ నాగినేని భాస్కరరావుతో సహ కవితా సంపుటి అది. యువభారతి కవితా సంకలనాల్లో, ఫ్రీవర్స్ ఫ్రంట్ 'తరంతరం', కేంద్ర సాహిత్య అకాడమీ 'తెలుగు కవిత' వంటి పలుసంస్థల కవితా సంకలనాల్లో

నా కవితలు వున్నాయి. అవేవీ చేర్చకుండా అంతా నా కవిత్వంతో ఒక సంపుటి ఇదిగో మీ ముందుకు ఇప్పుడే మొదటిసారి—

ఇందులోని చాలా కవితలు ఏళ్ళ క్రితంవి. రచనా కాలాన్ని, ప్రచురించిన పత్రిక తేదీలను సూచించాను. అందువల్ల ఆ కవితలు రాయబడిన కాలం, నేపథ్యం గుర్తించే వీలుంటుందని నా భావన. ఎన్నో మంచి కవితలుగా అప్పట్లో అనుకున్నవి తీరా ఇప్పుడు ఎంచుకుందామంటే నాకే చిత్రం! అందుకే ఈ సంపుటికి కవిత్వం ఎంపిక చేసిపెట్టమని ఆత్మీయులు శీలా వీర్రాజుగారిని కోరాను. సంకలనానికి ఈ రూపాన్నిచ్చిన వారికి నేను ఎంతో కృతజ్ఞుడిని.

నా కవిత పుస్తకంగా పట్టుబట్టి వేయించింది మా ఆవిడ ఉషారాణి. పుస్తకాలంటే ఇష్టం కాబట్టి వంత-మా చిరంజీవి స్నేహిత్. జీవితాన్నిచ్చిన అమ్మనీ, జీవితానికో మలుపునిచ్చిన స్నేహా(లి)నీ ఎలా మరువను! ఆత్మీయత పంచిన కుటుంబ సభ్యులకూ, నా కవితకు ప్రోత్సాహాన్నిచ్చిన అందరికీ, పత్రికలకూ, ప్రసారాలకూ ఈ అచ్చుపని వెనుక శ్రమ వెచ్చించిన ప్రెస్ కార్మికులకూ కృతజ్ఞుడిని.

ఇక నేను చెప్పేదేదో నా కవిత్వమే చెబుతుందని నా నమ్మకం.

16-11-310/9/1
సలీంనగర్ కాలనీ, మలక్‌పేట,
హైదరాబాద్ - 500 036

సదా మీ
**సుధామ**

# దిక్సూచి....


అప్పుడే 9, స్పృహ 11,
రాట 12, సకాలసకలం 14,
ప్రాతిపదికలు 17, స్వబోధం 19,
తమస్ 22, మామూలం 24,
36' చౌరంగీలేన్ 26, డూ ఇట్ 29,
అగ్నిసుధ 30, ప్రవృత్తి 32,
జీవనగీత 34, ఒక పరంపరాయుధం 36,
సమర కపోతం 41, ఎండలో సామాన్యుడు 43,
నిన్ను రైలెక్కించడానికి రాలేను 47,
సముద్రం 50, అమ్మమ్మ చెప్పని కథ 53,
నువ్వు 57, కలల బేహారికి 59,
విన్నపం 63, జీవితం 65,
ప్రతిమార్పూ సూర్యుడిగానే ఉదయిస్తుంది 67,
ఎర్రటిబంతి 71, సంభాషణం 72,
ఇన్ మై వే 73, అప్పుడు 76,
కుదరదు 78, అద్దపు బిళ్ళలు 79,
ఎవరైనాపోతే 81, చరిత్రను పఠించు 83,
నీడలు 86, అర్ధరాత్రి మేల్కొన్నవాడు 90,
నీటిలోంచే నిప్పు 93, మృత్యువు 94.

# అప్పుడే....

గాలి ఆడదు
ఆకు కదలదు
ఆదమరచిన అడివి
ఎగశ్వాస దిగశ్వాసలమధ్య
శబ్దపు తూటాలు దట్టించని
మౌనం రైఫిల్‌లా ఉంటుంది

కాళ్ళకింద ఎండుటాకులు తొక్కుతూ
ఇంతలో ఇనుపబూట్ల దాడి
కొమ్మమీద పిల్లపిచుక నోట్లో
మొలకగింజ పెడుతున్న తల్లిపిచుక
భయంతో ఎగిరిపోతుంది
చెట్టు కొమ్మ తనను
ఏనుగుతొండం విరిచినట్లుగా
ఫెళాఫెళా కిందపడుతుంది

గాయపడ్డ ఆకాశం
సంధ్యారుణిమ దాలుస్తుంది
నిప్పంటుకున్నట్లుగా అరణ్యం

సెగలపొగలు కక్కుతుంది
అప్పుడే, ఆవేళప్పుడే పుటంపెట్టిన బంగారంలా
ఆకులు బాకులై మెరుస్తాయి
కొమ్మలే రైఫిల్సై అరుస్తాయి
ఇనుమును సైతం కొలిమిలోకాల్చి కరిగించే శక్తితో
అడవి జ్వలిస్తుంది
అడవి నిజంగానే మంటల్ని కక్కుతుంది

*

(5.7.1988)

# స్పృహ

బహిరంగంగా రోడ్డుమీదే
సామూహిక మానభంగాలు అవుతున్నాయి
నలుగురూ నడిచే దారిలోనే
హత్యలు జరిగి రక్తప్రవాహాలు సాగుతున్నాయి
అయినా ఈ మనుషుల్లో
ఎక్కడా ప్రకంపనలు లేవేమిటి ?
మూసేసుకున్న గదుల్లాగా
నిశ్శబ్దపు ముళ్ళ కంచెలకు తగుల్కొన్న
పట్టి గుడ్డ పేలికల్లా వేలాడతారేమిటి వీళ్ళు ?
నిజమే
నడుస్తున్నారు కానీ వీరి దారికి దారి తెలీదు
అందరికీ కళ్ళున్నాయిగానీ దృష్టిలేదు

మంచిపని చేశావ్,
నువ్వొక నేత్రచికిత్సా శిబిరం తెరిచావ్
వీళ్ళ కళ్ళల్లో కవిత్వం చుక్కలు పడినతర్వాతయినా
చూపు రాకపోతుందా
అడవిసంగతి చెప్పాకయినా దారీతెన్నూ తెలీకపోతుందా

•

(26.8.1988)

# రాట

వచ్చేపోయే రథ్యలో జనప్రవాహాలమధ్య
కేవలం ఒక రాట స్తంభం
పీకకు పార్టీ జండాలూ వుంటాయి, ఎర్రకాగితాలూ వుంటాయి
రాటకు ఒక స్పందన వుంటుందన్న ఊహే లేదు జనాలకు
రాటకు మిత్రుల్లేరు రాటకు బంధువుల్లేరు
ఒరుసుకుంటున్న పురితప్ప

అవును అది రాట!
అందరిలా నాలుగు రోడ్లమధ్య జనప్రవాహంలో
అదీ నాటబడిందన్న ఘనత తప్ప
రాటకు ఆరాటాలనవసరం!
ఎండకు ఎండీ, వానకు తడిసీ, చలికి వణికీ చలించి
రాలిపోయే రాట!

జడతకో, సాంసారిక జడభరతుడికో
చైతన్య-స్పందనంలేని మనిషికో అది చిహ్నం
లోకంలో లోకుల మధ్య మనిషి రాటయినప్పుడు
జీవితం 'రాట్' అయినప్పుడు
యాంత్రికత పురుల్లో,
నాగరికత ఉరుల్లో బిగుసుకుంటున్నప్పుడు

ఆ రాటను ఎవరైనా చేతిలో ఆయుధంగా చేసి
బలమైన దుడ్డుకర్రగా
అవ్యవస్థ నడుం విరగ్గొడితే అదీ సార్థకత రాటకు
సాయుధుడై విప్లవించడమే సబబు
మనిషి పోరాటకు

*

(23.4.1986)

[ఆంధ్రప్రభ వారపత్రిక ప్రచురణ 16-7-86]

## సకాలసకలం

ఏ అక్షరం కంట్లోపడి గుండెను నులిమేస్తుందో
ఏ స్వరం చినుకు జారి చెవుల్లోంచి నాల్కను
లొట్టవేయిస్తుందో
అంతా అనుకోకుండానే—నిశ్శబ్దంగా

చలిసాయంత్రం వీధిమీద వెన్నుకు వెచ్చ ఆన్చుకుని
చక్రాలయంత్రంగా దూసుకుపోతున్నప్పుడు
మబ్బుల్లోంచి ఎండ ఉండలా దొర్లుతూండగానే
నల్లమబ్బొకట్టి హఠాత్తుగా పేలి
ఏనుగుధారతో ముంచెత్తి శరీరాల్ని
కదుల్తున్న జలపాతాల్ని చేసేయడం
హఠాత్తుగానే అంతా- క్షణంక్రితం ఊహకైనా అందకుండానే

అధివాస్తవిక చిత్రంలోనిరేఖల్లా చిక్కిరిబిక్కిరిగా
కడుపులో నరం మెలిపడినట్లు
నొప్పిపువ్వు వికసించడం
చూస్తూచూస్తూండగానే ఆ పువ్వుతోనే
ఛాతీలో పత్తిరైతు కాయలా పగిలి
నిటారుగాఉన్న చెట్టు పళ్ళూడిపోయి
ఎండుకట్టె మోపులా

స్ట్రెచర్‌మీంచి మంచుముక్కలా ఫ్రీజ్‌కావడం
తలలో మెరుపు మెరవకుండానే
బల్బు వెలగకుండానే
అంతా ఓ అదాటుగా గబుక్కునే

చూస్తూచూస్తూండగానే జీవశక్తినింపాల్సిన
పరబ్రహ్మస్వరూపం అన్నం
తొమ్మిది కన్నాలనూ తెరిచి
చిలకను వదిలేయడం గుడ్లగూబ నిశితచూపులో కాదు
రెప్పమూసి తెరిచేలోగానే

తెప్పరిల్లినట్లే ఉండదు
రోడ్డుమీద లారీ—పుచ్చెలతో పింగ్‌పాంగ్ ఆడడమో
గాలిలో విమానం భోగిమంటలా విచ్చుకుని రాలిపడ్డమో
జలకెరటం పడగలువిప్పి
గుడిసెల పాదాలమీంచి ఎక్కి కాటేయడమో
అన్నీ హఠాత్తుగానే—

అవును అకాలంగానే ఉంటుంది
వర్షమూ, ప్రమాదమూ, ప్రాణము కూడాను
ఆనందమో దుఃఖమో అనుకోకుండానే
ఎదురు చూడకుండానే
కానీ ధ్యేయం అలా కాదు ఆశయం అలా కాదు
ఉత్తరం రాసి మరీ ఉద్యమిస్తుంది
మిరపపండు ముక్కుతో మన్నెం బాణం
మండే గుండెల్లోంచి కంటి జలసూత్రంమీదుగా వడికిన

చూపుల కిరణంతో
చూపుడువేలు సంధించి మరీ
కొలిమిలో సంకెలపెట్టి మరీ
అకాలంగా కాదు
చెప్పే చెప్పే చూసే చూసే భరించే భరించే
రగిలిన జనజాతరగా మరీ
వేడిగా వాడిగా దాడిగా నాడిగా
సకాలంలో సకలంగా

*

(1.1.90)

[ఆంధ్రజ్యోతి దినపత్రిక సాహిత్యవేదిక
ప్రచురణ 12-3-90]

# ప్రాతిపదికలు

ఇంక పనికిరాదని ఓ ఆలోచనను
చింపి పోగులు చేస్తామా
అవశేషాల కుప్పలోని ఏ ముక్కలోంచో
ఓ చిన్న పదాన్నో, ఓ సగం వాక్యాన్నో పట్టుకుని
కొత్తఆలోచన జరజరా ఎగబాకి వస్తుంది

అటకమీద చెదలుపడుతున్న పనికిరాని పాతపుస్తకాలని
తూకానికి వేసేస్తే
ఏ పేవ్‌మెంట్‌మీదో దర్శమానమై
ఏ దాహార్తుని హస్తాల్లోకో ఒదిగివెళ్ళి
మళ్ళీ ఓ లేఖగా
ఓ చైతన్య సంస్పందనగా మనల్నే చేరుకుంటుంది

కాలదనుకుని పారేసిన టపాకాయ
అదేపేల్తుందో మరోదాన్ని అంటించి పేలుస్తుందో
ఊకేకదా అనుకుంటే
అందులో నిప్పుల ఊపిరి ఉంటుంది
నివురుకింద చేవరగిలే ఉష్ణం ఉంటుంది
అందుకే ఒక్కోమాటు విధ్వంసంనుండే కొత్తశక్తి అన్నది
అబద్ధం కాదని ఖచ్చితంగా అనిపిస్తుంది

చిత్తుకాగితాలు, విరిగిపగిలిపోయిన చెత్తసామాను
భద్రంగా గోనెల్లో ఎత్తితీసుకుపోతున్న
ఆ పిల్లవాడూ, ఆ ఆడదీ, ఆ జీబురుగడ్డంవాడూ
ఇప్పుడు నాకు
విధ్వంసం నుండి వినూత్న సృష్టికి ప్రాతిపదికల్లా శ్రమిస్తున్న
వాళ్ళల్లానే కనిపిస్తారు
*

(2.1.90)

[ఆంధ్రప్రభ వారపత్రిక ప్రచురణ 28-3-90]

# స్వబోధం

ప్రత్యక్షంగా శాసిస్తున్న పరిస్థితులు గురించి కానీ
బలీయంగా తొక్కేస్తున్న వర్తమానం గురించి కానీ
ఆలోచించరు
కనిపించని గ్రహాలో, నక్షత్రాలో
శాసిస్తున్నాయంటారు
గ్రహబలంకన్నా, నక్షత్రచ్ఛటలకన్నా
ఓ మాటకు పదునెక్కువ
మనసుకు పదునెక్కువ
మనిషిమసలే విధానం ప్రభావం ఎక్కువ
పుస్తకంగా విచ్చుకుని అక్షరంగా వెలిగేవాళ్ళు తప్ప
అనుస్పందనం కాలేరు
పరుషాల్లోంచి కూడా సరళాలు ఏరుకోలేనివారు
మానవతకు కాపుకాచే
మౌలిక రచనం ఊహించలేరు

జీవితం ప్రశాంతంగా ఉండదు
జీవితం మౌనంగా ఉండదు
జీవితం లాలనగా ఉండదు
జీవితం ఫైవ్‌స్టార్ హోటల్‌గదిలా ఉండదు

అన్నీ అమర్చిపెడితే
కవిత్వం చెప్పే పెద్దన్నలకాలం కాదిది
అలాంటి పెద్దన్నల అగత్యమూ లేనిది
సంక్షుభిత సముద్ర తుఫానులో
తలమున్కలై లేచి
జనఘోషలో సంగమించి
అగ్నికీలా వీచికగా ఎగిసి
సాహిత్యక్షేత్రాన్ని ప్రక్షాళనం చేయలేనివాడు
పనికిరాడీవేళ

తాంబూలాలు సేవిస్తూ, ఉయ్యాలలూగుతూ
రమణీకుచ మృగమద సౌరభాలు గ్రోలేవాడు
సమాజ వక్రతలన్నీ పరిశోధనాపాకాల
ఇనస్టెంట్ మసాళాదినుసులుగా
రచనలు వండేవాడు
ప్రజలను దోచుకుతినే వ్యాపారికన్నా మరేమీకాడు
విపణివీధిలో
సెక్స్‌ను, శవాలను, హత్యలను
అమ్ముకునేవాడికన్నా నికృష్టుడు మరొకడు లేడు

నువ్వు ఏమీ రాయకపోయినంతమాత్రాన
కలిగేనష్టం కన్నా
రాసి, వాసి దిగజార్చడంలో నష్టం ఎక్కువ
నువ్వేదో త్రివిక్రముడివై రచన చేయడం
బలిని మరింత బలిచేయడమే
నువ్వు రెండు కాళ్ళతో నడు చాలు
రెండు కళ్ళతో చూడు చాలు

నడిమంత్రపు కీర్తిసిరులు కడదాకా నిలువవు
నువ్వు ముందు కవికావడంకన్నా మనిషివి కా
ఎవరినో ఉద్ధరించడానికి ముందు
నిన్ను నువ్వు సముద్ధరించుకో
కవిత్వం రాయడంకన్నా కవితగా బ్రతుకు

*

(13.8.1988)

# తమస్

వెలుతురు కోరేవాడు తమస్సుకు భయపడడు
చరిత్ర అద్దంలో తన గత స్వరూపం చూసుకుని
ఉలికిపడేవాడు పురోగామి కాలేడు
ఆవులనూ పందులనూ చూసి ఆవేశపడేవాడు
సాటి మనిషిపట్ల స్పందించలేకపోవడం విషాదం
కదులుతున్న దృశ్యాలకు కలవరపడేవాడు
స్తబ్ధుడే తప్ప ప్రవాహం కాలేడు
జీవధార కాలేడు
నిజమే మరి పాపం
పాటల పాటవంతో రక్తచరణం కాలేనివాడు
చర్విత చర్వణాలకే చలించిపోతాడు
వాచకాల తొలిపుటల ప్రతిజ్ఞలోని
వారసత్వ సంపద గర్వకారణాలకు
పర్వదినాలు జరుపుకునేవాడు
భూతాల్ని భూతంగానే భయపడతాడు
చేసిన తప్పిదాలనే పునరావృతం చేస్తాడు
గతం మత్తులో మతం పొత్తులో
గణాచారి అవుతాడు
వారసత్వం ఈ జాతికి అంటుతున్న జాడ్యం
ఏ రంగంలోనైనా అదే తారంగం

తండ్రి నుండి కూతురు కూతురు నుండి కొడుకు
భర్తనుండి భార్యో, కొడుకులో, కొడుకులకొడుకులో
పదవుల్నీ, పాలనల్నీ, కళల్నీ
ఆక్రమించుకుంటూనే వున్నారు
చెట్టుపేరుచెప్పి కాయలు అమ్ముతూనే ఉన్నారు
విషసంస్కృతి బీజాలను విత్తుతూనే ఉన్నారు
ఇక్కడంతా వారసత్వమే
ఆకలి వారసత్వం దారిద్ర్యం వారసత్వం విషాదం వారసత్వం
ఇదంతా వారసత్వ సంపద
కలెక్టరు కొడుకు కలెక్టరు అయి
కూలివాని కొడుకు కూలివానిగానే వుండే
ప్రణాళికలు మన పాలనాపథంలో
కళ్ళకు కన్నీళ్ళు
బుద్ధికి బూడిదలు
మెదళ్ళకు దళ్ళు
హృదయాలకు పగుళ్ళు
ఇదీ అసలు తమస్సు
ఈ తమస్సులో జీవించడం ఒక తపస్సు
ఇక్కడినుంచే జనించాలి ఉషస్సు

*

(7.2.1988)

# మామూలం

రాత్రి వెన్నెలదుప్పటి కప్పుకున్నవాడు
ఉదయం సూర్యకిరణ స్నానం చేయకపోడు
మబ్బుమబ్బుగానే ఉండదు
వర్షమౌతుంది
మొలకెత్తే ఓ నవసస్యానికి చైతన్య హర్షమౌతుంది
తుపానులు తుపానులుగానే ఉండవు
పచ్చనిపైరుల షిఫాన్‌చీర భూమి చుట్టుకోకపోదు
వయసంటే వయసుగానే వుండేది కాదు
వికాసవంతమైన మనసుగా
అనుభవాల ఉషస్సుగా
నిత్యం ఉధయించి విస్తరిస్తూనే ఉంటుంది
మృత్యువంటే జడత్వం తప్ప మరేమీ కాదు
క్రియలో, ఆశయాల ఆచరణలో
ఊపిరిచేతులు పనిచేస్తున్నంత కాలం
మనిషి జీవిస్తూనే ఉంటాడు
శ్రమశక్తి విజయాలే మనిషిప్రాణదీపాలు
ఏదీ ఆగిపోదు
బుద్ధి ఆలోచిస్తూ, హృదయం ప్రేరణను పంచుతున్నంత కాలం
నువ్వునువ్వుగా పువ్వుమీది మంచుబిందువు నవ్వుగా
అందమైన ప్రకృతిదృశ్యంగా

కనిపించడం మటుకే చాలదు
కదలాలి, దృశ్యం ప్రవహించాలి
బ్రతుకు కేవలం బ్రతకడం కాదు
బ్రతుకులను బ్రతికించాలి
నువ్వు పెరట్లో నీడనిచ్చే చెట్టువేకాదు
నాలుగురోడ్ల కూడలిలో దారిచూపే జనహితుడివి కావాలి
నువ్వు నిశిని పారద్రోలే కిరణానివి కావాలి
చెడును తెగటార్చే రణానివి కావాలి
పచ్చదనం గుర్తుగా వ్యవస్థ ద్వారానికి మంగళతోరణం కావాలి
నువ్వు మనిషివి మనీషివి కావాలి

*

(25.11.1987)

# 36' చౌరంగీలేన్

ఒంటరి తీగెమీద
ఏకాంతపు పాలచుక్కల మధ్య
ముడుచుకు పడుకున్న పిల్లితప్ప

చర్చిగంటల
ఉదయపు కలవరాల కలరవాల్లో
కాగితం పడవల మీదనే కాని
పాఠంమీద శ్రద్ధలేని పిల్లలమధ్య తప్ప

సన్నగావీచే ప్రకటనల రేడియో సంగీతంలోంచి
అస్తమించిన సాయంకాలాల్లో
విస్తరించిన రాత్రిదీపాల సముద్రంలో
సాగే పడవల క్రీనీడల
నిదరపోయే అభాగ్యసాకారాల నేత్రాలుతప్ప
ఏమీలేని గదిలో
గదితప్ప ఏమీలేని నేనుతప్ప
ఈవీధిలో ఇంకేబండీ ఆగిందిలేదు ఎప్పుడూ

ఆలాంటిది
చిన్నప్పుడెప్పుడో నా దగ్గర చదువుకున్న
ఒక ముడి

తన యవ్వనపు జతతో
ఒకపూట టీ కప్పుమీద ఆవిరిగా అల్లుకుంది

రాత్రి స్వప్నంలో సైతం
శ్మశానంలోకితప్ప తలుపు తెరుచుకోని
గదిలో
ఆ జంట
నేను లేనప్పుడు
అధర పరిష్వంగ చుంబనాలను
చుట్టూతా అద్ది వెళుతున్నారు
షేక్స్పియర్ సాహిత్యపాఠాల గదిలోంచి
గ్రామర్‌పాఠాలవైపుకి
నన్ను మార్చినా
వృద్ధాప్యగృహంలోని సోదరుడు
ఆసరాలేని ఆర్తితో
ఆఖరిశ్వాస విడిచినా
నా గదిలో ఆవరించిన
యవ్వనప్రేమ చుంబనాలను చూసుకుని కాదూ
ఆకురాలు కాలంలో సైతం
అయిస్‌క్రీమ్ జతగా గప్‌చిప్‌లు తిని
ఆ జంటవెంట
ఆనందాన్ని పరివ్యాప్తం చేసుకున్నాను

వారి శాశ్వత బంధానికి
అక్షతలు జల్లివచ్చాక
మళ్ళీ బావురుమంటున్న గదిలో

వట్టి జ్ఞాపకాల దిండుమీద
ఇంకా ఏం బావుకుందామని....!?

గుండెకు ఈ చివరవెలిగిన
ఆత్మీయతా కాంతి
ఆ చివర జంటతోటలోనూ
అలాగే వుందని నమ్మి
క్రిస్మస్ కేకుతో ఆశ్చర్యపరచాలని వెడితే
ఉండీ లేకపోతామని నమ్మించిన
తియ్యటి తేనెకత్తి గుచ్చుకుని
ఘాతుక దిగ్భ్రాంతిలో జడమైపోయినప్పుడు
క్రిస్మస్‌కేకును వాసనపట్టిన కుక్క తప్ప
విశ్వాసాన్ని విస్తరించిన వీధిసింహం తప్ప
ఒంటరి తీగెమీద
ఏకాంతపు క్రిస్మస్ కేకుతప్ప
ఇప్పుడింకేం ఉంది ఈ వీధిలో
ఏమీలేని గదిలో
వృద్ధాప్యపు అనుభవం గది తప్ప ఏమీలేని
నేనుతప్ప....

*

(15.12.1981)

# డూ ఇట్

ఫైళ్ళు పరిగెడుతున్నాయి
జైళ్ళమీంచి రైళ్ళమీంచి రైఫిళ్ళమీంచి

చెవులున్న కోర్టులకు కళ్ళు అతికించండి
బళ్ళకొద్దీ పేరుకున్న దిగుళ్ళను పరిశీలించండి
న్యాయం నోళ్ళునొక్కే అధికారాధికారాల్ని
కరెన్సీకట్లను తగలబెట్టండి
నిజాన్ని నిప్పులా ప్రజ్వరిల్లనీయండి

ఒకనాడు తండ్రి ఆనతిపై
తల్లి తలదునిమిన వాడె భార్గవుడు
ఈనాడు ప్రజల ఆనతిపై
నిలచి నిజం నిలబెట్టినవాడె భార్గవుడు

*

(20.8.1977)

# అగ్నిసుధ

నిప్పు దగ్గర చేరుస్తుంది
నిప్పు ఊపిరి పోస్తుంది
నిప్పు జీవితం ఇస్తుంది
నిప్పు బతికిస్తుంది

నిప్పు రాపిడిలోంచి వస్తుంది
రాపిడి నిప్పుకోసం జనిస్తుంది

నిప్పు నాగరికత
నిప్పు ప్రపంచాన్ని మార్చినకథ
నిప్పు చరిత్ర

ఆకాశం మీద నిప్పు తెల్లటిబంతిలా
రాత్రింబగళ్ళ అంచులమీద
కాలం మైదానంలో క్రీడిస్తుంది
నిప్పు వెన్నెలగా కురుస్తుంది
నిప్పు వానగా చలిస్తుంది

అన్నీ నిప్పువైపే ప్రయాణిస్తాయి
మనుషులు, వాళ్ళశరీరాలు
శ్రమలు, శ్రమలో మనసులు
బ్రతుకులు, బ్రతుకులో ఆరాటాలు
ఆశలు, ఆశయాలు
వాటికోసం పోరాటాలు
అన్నీ అగ్నిమార్గంలోనే

కట్టెల్లోంచి
కట్టై అయ్యే దేహంలోంచీ కూడా
నిప్పు ప్రవహిస్తూనే వుంటుంది

భావుకతల్లో, ఊహల్లో
ఆలోచనల్లో, ఆవేశాల్లో
అగ్నిస్పర్శ సదా జ్వలిస్తూనేవుంటుంది
ఊకలోని వేడిలా

నీళ్ళలోంచి కూడా నిప్పు
ప్రచండమారుతంలోంచి నిప్పు
ఉప్పుసముద్రం అడుగునుంచి ఉబుకుతూనిప్పు
కోరికలో—కన్నీటి చారికలో నిప్పు
మాట—భావ సంఘర్షణల్లో జనించిన నిప్పు
మనసు—ఆశయాల కోరికల సెగలు విసిరే నిప్పు
ఆత్మ—నిత్యాగ్నిహోత్రం
"అగ్నిమీళే పురోహితమ్" అని వేదఘోష
అగ్ని ఆధునిక ప్రపంచంలో
అభ్యుదయ సుధలు పంచుతున్న యోష

అగ్నిసుధే సర్వస్వం
మానవుడే దానిని గుండెల్లో నింపుకున్న
సకల చరాచర విశ్వం

*

(9.10.1985)

[ఆంధ్రప్రభ వారపత్రిక ప్రచురణ 4.12.85]

# ప్రవృత్తి

ఎడారినేత్రాల ఎదలు చెమ్మగిలవు
మూడుకాళ్ళ కుందేళ్ళు పట్టిన
ముదుసలి బుర్రలు వివేచించవు
అతిగా ఫంగస్‌లా పెరిగిన అహంకార జాడ్యం
శాసనాలతో, చట్టాలతో
సృజనాత్మకతను స్థాపించగలనని విర్రవీగుతుంది

ఒక్క కలం గీటుతో గుండెల్లోగాట్లు పెట్టే
అధికారదర్పం, ముసిముసి నవ్వుల సర్పం
పాలుతాగి ఆ గిన్నెలోనే విషం కక్కుతుంది

నీళ్ళదాకా తీసుకెళ్ళిన గుర్రాన్ని
నీరుమాత్రం తాగించలేమని తెలిసీ
గుర్రపుస్వారీ చేయాలనే అభిలషిస్తాడు అవివేకి రౌతు

చట్రాలు కట్టి, పరిధులుగీసి
పంజరాలు, బోనులు నిర్మించి
స్వేచ్ఛనిచ్చాం ఎగురు అంటుంది పాలకం

అరణ్యాలు తగలబడిపోయినా ఫరవాలేదు
అరకిలో బొగ్గులు కావాలి వాళ్ళకి

సముద్రాలు ఇంకిపోయినా సంతోషమే
గుప్పెడు ఉప్పు సంపాదించాలి వాళ్ళు
మానవత్వం చచ్చిపోయినా ఫరవాలేదు
మనిషి ఇబ్బంది పడాలి—చాలు వాళ్ళకి
చెరువులో బ్రతికే వాటిని చెంబుల్లోపడేసి
వినోదించడం వారి ప్రవృత్తి
అందుకు సహాయకారి వారి పాలకవృత్తి

వెలిగే దీపాన్ని పగలగొట్టి
చుట్టూ చీకటిమయం చేసి
'చూశావా నేనే వెలిగిస్తున్నా దీపం' అంటూ
ఓ మూల కొవ్వొత్తి వెలిగించి
కొవ్వెక్కి చప్పట్లుకొట్టే నైజం
అదీ ! ఆ చిత్తవృత్తి

ఎప్పుడో యవనిక పడుతుంది
నేపథ్యంలోకి తోయబడ్డ జీవలక్షణం
జనాల గుండెల్లో వైతాళికగీతం పలుకుతుంది
అప్పుడు అహంకారికి సెలవంటాం
కళను బ్రతికించుకుంటాం

*

(7.11.1985)

[ఆంధ్రప్రభ వారపత్రిక ప్రచురణ 5.3.86]

# జీవనగీత

గుండె చరియలు విరిగి జీవన అగాధాల్లో
స్ఖలితమవుతూంటాయి
కలల సముద్రంలో ఆశయాల నావను కన్నీళ్ళ తుపాన్లు
ముంచెత్తుతూంటాయి
ఆశించని పుష్పాలెవో గాలిని చెరసాల పరిమళాలతో
బంధిస్తూంటాయి
శకలాలు శకలాలుగా నక్షత్రనేత్రాలు శిరోవేదనల సెగలమధ్య
జ్వలిస్తూంటాయి
ఇంద్రధనుసులూ, నందనవనాలూ, స్వర్గలోకాలూ
స్వప్నద్రాక్షలుగా ఎత్తయిన ఆశల పందిళ్ళకు గుత్తులుగా
వేలాడుతూంటాయి
రంగుల కాగితం వలువ చుట్టబెట్టుకున్న ద్రాక్ష
అక్షరాల్లో ఆవిరయ్యే ఊహారసాయనంగా
రంగూ రుచీ వాసనాలేని దాని పొగగా, దట్టంగా పరిసరాల్లో
కమ్ముకుంటూంటుంది

నువ్వు తాటిచెట్టువి కావాలనుకుని జిల్లేడులా పాకుతూంటావు
గిల్లితే కవిత్వం పాలు కారవలసిన చోట
తాటికల్లు కూడా కాదు సరికదా
అధిరోహిస్తున్న గీతకార్మికుడి వెన్నునుండి
ఘర్మజలధార మటుకే స్రవిస్తుంది

చెట్టుకూ నడుముకూ కలిపి బంధం వేసుకున్నది
అధిరోహణకే అయినా
కాళ్ళల్లో చైతన్యశక్తి హరించినప్పుడు
చూపుల్లో భయంకర భవిష్యత్తు తిష్ఠవేసినప్పుడు
ఎక్కేదిపైకి కాదు - ఊపిరి కొసలకి
గీతాసారం బ్రతుకు రాతల్ని మార్చదు
తొక్కడం వ్యవస్థ లక్షణం
అయినా ఎక్కడం వ్యక్తి లక్ష్యం కావాలి
ఎవ్వరూ పైకి తోయరు
నీ కాళ్ళను లాగే రాలిపడే బెరళ్ళు
చుట్టూ మనుషుల మెదళ్ళు—ముళ్ళు ముళ్ళు మొదళ్ళు
నువ్వు పొగలోంచి నడవాలి —విరిగిపడే చరియలు దాటాలి
ముంచెత్తే తుఫాన్లను పెదాలపై నవ్వులతో ఎదురొడ్డాలి
కటకటాలు తెరుచుకుని స్వేచ్ఛను పట్టాలి
జ్వలించే వేదనల్ని వెన్నెలతో తడపాలి
వేలాడే ద్రాక్షలను అందుకోవాలి
తాటి చెట్టెక్కితేనే ద్రాక్షలందేవి
తాడితుడివైనా నిలబడి తలబడినప్పుడే
గీతగీయగలిగేది—రాత రాయగలిగేది
అక్షరం నిలుపగలిగేది—ఊపిరి ఊదగలిగేది
వ్యవస్థ మార్చగలిగేది

*

(9.6.86)

[ఆంధ్రప్రభ వారపత్రిక ప్రచురణ 20.8.86]

# ఒక పరంపరాయుధం

ఎర్రటి నేల సరసన
చుట్టుపక్కల ముప్ఫయ్‌రెండు తెల్లటి ఎనామిల్ గుహలు
ఆవలగా అంతులేని అగాధాలలోయ గొంతు
వీటన్నిటికీ కనిపించనిచోట హృదయారణ్యం
మరింకింతఎత్తున అనుశాసనపర్వపు సంకీర్ణాధికారనగరం మేధ

మన తొలినివాసం అదివే
అక్కడే మొదట నిప్పును కనుక్కున్నది

అర్థంకాని జీవితపు ఆరాటాల పోరాటాల్లోంచి
ఎన్నో ఏమిటో చెప్పలేని వివిధ సంకేతాల గుబురుల్లోంచి
సంఘర్షించిన భావాల్లోంచి
ఓ అర్ధరాత్రి హఠాత్తుగా లోయలోంచి
మొట్టమొదటి మన ఆయుధం దూసుకొచ్చింది

ఒరలోంచి లాగిన క్షణంలోనే పదునును ఝళిపించే ఆయుధం
అనుకున్నప్పుడు అనుకున్నచోట అనుకున్నదానికల్లా
పనికొచ్చే పనిముట్టు
భావాన్నిబట్టి రూపాన్ని మార్చుకునే శక్తి ఆయుధంలా అది—
పరంపరాగతంగా ఎన్నిహాయలుతో దూసుకుపోతోందో

కానీ అదేం చిత్రమో !
అరణ్యం నుంచి నగరానికి ప్రవేశించిన మాత్రాన
దీనికి ముసుగులు, చిత్రికలు, నాగరీకం రంగులు
అందంగా హొయలు వయ్యారాలు నేర్పింది కానీ
ఎంత మారిపోతోంది ! ఎంత బిరుసెక్కుతోంది !
నగరాధికారానికి ఒదిగి- కాకాలకి, బాకాలకి, మొగమాటాలకి
పడమటి వన్నెల ప్రభావాలకి, ఎంతచిత్రంగా ఈ ఆయుధం
సహజమైన అదును పోగొట్టుకుంటూ
ప్లాస్టిక్ నాణ్యతతో, సింథటిక్ పదునుతో
లోయనిండా గిరికీలు తిరుగుతుంది ! పల్టీలు కొడుతుంది !

దంతపుగుహల గాలుల్లోంచి లేచి
ఎర్రటి నేల సరసన కవాతు చేసే
పదసైనిక సమూహాలతో వచ్చే ఇది
అరణ్యాన్ని మరిచి
నగరం శాసనాలకు నియంత లాలనలకు లోబడిపోతూ
శిథిలాలయ నిఘంటువుల రుద్రభూములకు
మంచుపల్లకి యాత్రచేస్తుందా ?
ఇవాళ నగరంలో దీన్ని నా కోపాన్ని మోయమంటే
చిట్లిన నా నుదుటిని సంకేతించమంటే,
నిరసనల్ని నినదించమంటే
ఉన్న ద్వేషాన్ని వెలిగక్కి-
ఉత్తాలమైన ఆశయాన్ని, లక్ష్యాన్ని, గమ్యాన్ని నిలిపి
ఆచరణాపథాన విజయ విప్లవాక్షరాలను ఉచ్చరించమంటే
దంతపుగుహల గాలుల్ని ప్రచండమారుతం చేసి

తప్తదగ్ధమౌతున్న హృదయారణ్యాన్ని
ఉన్నదున్నట్లుగా ప్రతిధ్వనించకుండా
తన కవాతు నడకలో
మేధాధికారపు శాసన ప్రకటనలకు
మానిఫెస్టోలకు, నియమావళులకు, జీ.ఓ.లకు ఎదురుచూస్తూ
ప్రజలగుండెలకు బదులు
ఏవేవో సిద్ధాంతగ్రంధాల పుటలు తిరగేస్తూ
పార్టీల డిక్షనరీలకు, వేర్వేరు జార్గాన్లకు, మౌత్ ఆర్గాన్లకు
నిలబడిపోయి,
ఆపై సావకాశంగా సోఫాలో జార్లబడి,
టీ కప్పు పొగలకి, సిగరెట్టు రింగులకి
సీసాద్రవాల పొంగులకి కాంక్షిస్తూ
అరణ్యాలరణాలు కాక నాగరికపు సుఖవ్రణాలు
ప్రేరణలు కావాలంటుందా ?

ఏది దీని ఆదిమస్థితి ?
ఏమైపోయింది ఆ సహజ ప్రతిస్పందనల వీరాకృతి
తుప్పు పడుతోందా ఆయుధానికి పదునుచెడిందా దీనికి
లేక— ఉపయోగం తెలియని ప్రతివాడి వాచాలతకు
అలంకారంగా
పావురం ముక్కున బ్లేడుముక్కలా నిలబడిందా ?
ఏమైపోతోంది ఆ ఆదిమపదును ?
నిప్పుపుట్టిన మొదటిక్షణాల తీవ్రత
దంతపుగుహలమీద టూత్‌పేస్ట్లు పులిమి
గొంతులోయల్లో ద్రాక్షాసారాలు నింపి

నేలనాలుక మీద ఎరల పంచదార బిళ్ళలు వొంపి
అరణ్యాల దారుల్ని మూసేసి
చీకటిగుంట మేధోనగరంలో—
అర్ధనగ్న క్యాబరేలు, ఉస్కోల డిస్కోలు తెరిచి
ముఖమల్ పెట్టెలో పెట్టిన ఆయుధంగా
ఏలికల నగిషీల నజరానాగా
ఎవరు దీన్ని నిద్రపుచ్చుతున్నారు మ్యూజియంలోలా ?

కవి సూర్యుడా ! ఉదయించు
నీ కిరణఖడ్గంగా ఝళిపించుదీన్ని
ఆదిమానవుడి గుహలమాటునుంచి, అప్పటి లోయల్లోంచి
ఎంతసహజంగా చీకటిని ఛేదించిందో నీకు గుర్తులేదూ !
హృదయారణ్యంలో
భావతీవ్రతకు పరస్పరం జరిగిన సంఘర్షణలో
ఎలా అంగలువేస్తూ లేచి వచ్చిందో
ఆరోజు ఎంత సహజంగా నరాలు తెగేలా కేకలుపెట్టి
క్రియకు సారథ్యం వహించిందో నీకు గుర్తులేదూ
మనసా వాచా కర్మణా ఒకటిగా
ఎలా పుట్టిపెరిగి లయించిందో
జయించిందో నీకు గుర్తులేదూ !
ఇది అదే ఆయుధంరా నాన్నా !
సందేహించకు దీనికి ప్రాణప్రతిష్ఠచెయ్యి
నీ అవయవాల్లో ఒకటైపోయినట్లుగా
అతిసహజంగా దీన్ని మొయ్యి
హృదయారణ్యంలోంచి లేవనియ్యి

మేధోనగరం జంబూక శాసనాలకు లొంగక
ఆయుధానినే—
మేధను సహజంగా విచక్షించగల పదునుగా రగలనియ్యి
దురవస్థను నిలుపునా కూలనియ్యి
నీ అవయవాల్లో ఒకటైపోయినట్లుగా
అతి సహజంగా దీన్ని మొయ్యి
భాషను నీ సంపూర్ణ భావవినిమయ సాధనాయుధం కానియ్యి

*

(10.1.1982)

[స్రవంతి మాసపత్రిక ప్రచురణ జూలై' 83]

# సమర కపోతం

శాంతి గురించి మాట్లాడటం అంటే
యుద్ధవిరామం గురించి మాట్లాడటం
యుద్ధవిరామం గురించి మాట్లాడటం అంటే
రానున్న వ్యూహం గురించి మాట్లాడటం

యుద్ధానికీ యుద్ధానికీ మధ్య
శాంతి ఒక విరామచిహ్నం అయినప్పుడు
శాంతికోసం యుద్ధం చేయక తప్పదు

రాజీపడటం శాంతికాదు
కాళ్ళు బారచాపి క్రియా శూన్యమవడం శాంతికాదు
బుద్ధినీ హృదయాన్నీ జోకొట్టడం శాంతికాదు
చేతులు ముడుచుకుని నోట్లోకి ముద్ద వెళ్ళాలనడం శాంతికాదు
అలిగి మూలకూచోవడం శాంతికాదు
దేశం గొప్పదని పడక్కుర్చీ కలలుకనడం శాంతికాదు

శాంతి గొప్పదే
గొప్పశాంతి కోరేవాడివే అయితే
ఆయుధాల విజ్ఞానం తెలియాలి
యుద్ధస్పృహలో వుండాలి

దుశ్శాసన హస్తగతాలై విడివడి ముడివడని
ద్రౌపది శిరోజాలూ యుద్ధస్పృహే
నర్తనశాలలో ఉత్తరనాట్య శిక్షణాశ్రితాలైన
బృహన్నల హస్తపాద విన్యాసాలూ యుద్ధస్పృహే

అజ్ఞాతం పదునెక్కే ఆయుధం
అజ్ఞాతమైనా అరణ్యమైనా శాంతికోసమే
శాంతికోసం అంటే
శాంతికోసమైన యుద్ధం కోసం

పోరాటశీలికానివాడు శాంతికి సమర్థుడు కాలేడు
సంఘర్షించనివాడు శాంతికి యోగ్యుడు కాడు
శాంతి అంటే స్నేహం కూడాను
స్నేహం అంటే సంఘటితమవడం
సంఘటితమవడం అంటే అణచివేతను ఎదుర్కోవడం
శాంతి సమాహారం కావాలంటే సమరం అనివార్యం
శాంతికోసం శాంతిలోవుంటూ
ఆలోచించాల్సింది శాంతిగురించి కాదు
శాంతికోసం ఎదుర్కోవాల్సిన యుద్ధం గురించి

అందుకే
శాంతి గురించి లక్షిస్తే పోరాటానికి సిద్ధంకావాలి
ఎర్రపావురాల్లాంటి నీ హృదయహస్తాలను
ఆయుధం రెక్కలతో స్వేచ్ఛగా పైకెగరనీయాలి
ఇకనుంచీ శాంతికపోతం అనకు
సమరకపోతం అను

(23.9.1989)

[ఆంధ్రజ్యోతి వారపత్రిక
'ఈ వారం కవిత' ప్రచురణ 22.12.1989]

# ఎండలో సామాన్యుడు

ఆవిరవుతున్న నెత్తుటిగాలిలా ఎఱ్ఱని ఎండ
ఆంబోతు రంకెలా పేట్రేగుతున్న ఎండ
చెరిగిన కుంకుమ ఆరబోసినట్లు పరుచుకుంటున్న ఎండ
సన్ననిసూదులుగా సూర్యుడు కురుస్తున్న ఎండ
క్షుభితుని కోపంలా ఉడికిస్తున్న ఎండ
నల్లటి కండల కాన్వాస్‌పై తెల్లని చెమట బొట్లను
స్ప్రే చేస్తున్న ఎండ

రాళ్ళను బద్దలు కొడుతున్న సుత్తిఎండ
కడుపును దొలుస్తున్న ఆకలిలా
భూమి పెళ్ళలను పెకిలిస్తున్న గునపం ఎండ
కణతలు బద్దలవుతున్న, కళ్ళులాగేస్తున్న
శిరోవేదన శిఖరం లాంటి ఎండ

రోడ్డింజన్‌లా భారంగా
పుర్రెల్ని పొగలా వదులుతున్న
శ్మశాన కర్మాగారంలా రాక్షసంగా
నీటిచుక్కపడని నాలుకపుండుమీద
కొత్త ఆవకాయలా ఘాటుగా
ప్రతిఘటనల ఊడ్పులా, అక్షరాలగాడ్పులా ఎండ

రోహిణీకార్తె రోళ్ళు బద్దలు కొడుతోంది
జఠరాగ్ని ఆర్తి నోళ్ళు బద్దలు చేస్తోంది
నిజమే వీడిని చూడు
వీడలేని నీడకోసం బడుగువాడు గొడుగుకోసం
అడిగి చూస్తే, అడుగువేస్తే, అడుగు చూస్తే....?

ఎడారిలో ఖర్జూరం వుందని, ఒంటెకడుపులో నీళ్ళున్నాయని
గ్రహాలకు ఆగ్రహం కలగకపోతే అంతా సజావేననీ
ఆశల పూలతేరులమీద కూచోబెట్టి
వెన్నెల పేరు చెప్పి
ఎడారి ఇసుక తిన్నెలమీద నడిపిస్తున్నారా
ఎండ పెనంతో సామాన్యుని పెనవేయిస్తున్నారా

అవును వీడు పిడుగే
అగ్నిపర్వతం మింగి అలలానవ్వే సముద్రపు మడుగే
ఆయినా ఓర్మిని, అనురాగం కూర్మిని పట్టుకొని
ఎన్నికలల్లో నమ్ముకుంటూ, ఎండలో, ఏలుగడలో
ఏమీ మాట్లాడకుండా వెన్నెలని ఊహిస్తున్నాడు
శరద్రాత్రులను ఊపిరి పీలుస్తున్నాడు
పూర్వపుణ్యాల పొందుల్లో
భవిష్యత్తు విందులను వడ్డించుకుంటున్నాడు
పల్లెత్తి పరుషాన్ని పండించాలని కాని
పల్లెవిడిచి వెళ్ళాలనిగానీ అనుకుంటున్నవాడు కాదు
కానీ ఎంతకాలం ఎండగాడ్పు, వడగాలి
చేతులకు తట్టెడు మట్టి, కళ్ళకు మాత్రం వర్షఋతువు

కడుపుకు గుడుసుళ్ళు తిరిగే గాలితరంగాల లోయ
ఎంతకాలం

ఆకాశమా! అవనీ!
అవనీకండి ఆశాసౌధాలను నేలమట్టం
వ్యవస్థను రోగగ్రస్తం కానీకండి
సామాన్యుని శాపగ్రస్తుడిని చేయకండి
పువ్వుల్ని కన్నీళ్ళుగా మార్చకండి
గొడుగులు మార్చుకోవాలని
అడుగులు జార్చుకోవాలని కాదు వీడు కోరేది
నాటిన మొక్క ఏదో చెప్పి
న్యాయంగా నాణ్యంగా
దానికి కాయవలసిన కాయల్ని కాయనిచ్చేలా
నీరుపోసి పెంచమనే
అదిఇచ్చేనీడను అనుభవించే అభయం ఇమ్మనే
వీడికి గారడీచెట్ల గమ్మత్తుఫలాలు అక్కర్లేదు
అధికారాలు, ధనాగారాలు అక్కర్లేదు

ఆకాశమా! అవనీ!
తీక్షణతపాన్ని అగ్రపీఠాధిపతిని అవనీకండి
ఎండను ఏలుబడిగా చేయకండి
ఎండలూ, ఎడారులూ పెంచక
వెలుగునీ, వెన్నెలనీ తుంచక
ఊపిరులకు పురులుపేనక
ఉచ్ఛ్వాస నిశ్వాసాలను సాఫీగా ప్రసరింపజేస్తే చాలు
నాలుగు వేళ్ళూ నోట్లోకిపోయి కడుపు నిండితే చాలు

ఇంతనీడకింద తల తృప్తిని కలవరిస్తే చాలు
ఎండమండిపోకుండా కండగెలిస్తే చాలు
మట్టి ఎండిపోకుండా మొక్క మొలిస్తే చాలు
గాలివీస్తే చాలు, నీరు దొరికితే చాలు
వెన్నెల నిలిస్తే చాలు
మానవతా మందారం వికసిస్తే చాలు

*

(23.4.1981)

[1983 ఆకాశవాణి జాతీయ కవి సమ్మేళనానికి
ఎన్నికయిన తెలుగు కవిత]

# నిన్ను రైలెక్కించడానికి రాలేను

నిన్ను రైలెక్కించడానికి రాలేను
నీ ప్రయాణం చాలా విలువైనదే కావచ్చు
నువ్వు ఫస్టుక్లాసులోనే ప్రయాణించక్కర్లేదు
సెకండ్‌క్లాస్ స్లీపర్‌లోనే
ఢిల్లీకో మద్రాసుకో బొంబాయికో కలకత్తాకో
ప్రయాణిస్తావు కామోసు
అయితేనేం
అంతఖర్చు భరించగల నీ ప్రయాణం
తప్పక నీకు జరూరీయే కావచ్చు
కానీ నీ సంపదకు నాకు అసూయలానే అన్పిస్తుంది
ఎర్రజండా బడ్జెట్ పత్రంలా కన్పించేనాకు
అది నీ గొప్ప విలాసయాత్రకు ఎత్తిన పచ్చజండాలా
ఊదిన విజిల్‌లా ధ్వనిస్తుంది

దూరానవున్న
ముసలి రోగిష్ఠి సన్నిహిత బంధువుని
వెళ్ళి పరామర్శించడానికి గానీ
అదేదో వూర్లో
జీవన ప్రయాణానికి సహచరిని

తోడు చేసుకోబోతున్న
ఆ ప్రమిత్రుడి పెళ్ళికి వెళ్ళి రావడానికి గానీ
ఆలోచించే పరిస్థితిలో పడ్డ
ఫక్తు మధ్యతరగతి మనస్విప్పుడు నాది
వస్తుందో రాదో తెలీని ఉద్యోగానికి
డబ్బు ఖర్చుపెట్టుకుని
పై వూర్లో ఇంటర్వ్యూకి హాజరుకాలేని నిరుద్యోగి స్థితినాది

నువ్వు కిటికీ దగ్గర కూచుని కదుల్తున్న రైల్లోంచి
చెయ్యూపుతుంటే
నేనిప్పుడు తట్టుకోలేను
నీకూ నాకూ మధ్య స్నేహం వున్నమాట నిజమేగానీ
బడ్జెట్ ఇంత ఎడాన్ని
సృష్టించగలదనీ
మానవ విలువలను సైతం క్రమంగా హరించగలదనీ
నే నూహించలేదు

ప్లాట్ఫారం మీద నేను
ఇకపై నీకు వీడ్కోలివ్వలేను
నిన్ను రైలెక్కించడానికి రాలేను
చేదుగా తోచినా సరే
వాస్తవం చెబుతున్నాను మిత్రమా!
రూపాయిన్నర ప్లాట్ఫారం టిక్కెట్టు కొని
నిన్ను రైలెక్కించడానికి రావడం కన్నా
మరో అర్ధరూపాయి పోగుచేసుకుని
ఆ ధరతో ఆకుపచ్చ కార్డు మీద

పుచ్చువో చచ్చువో
కిలో రెండ్రూపాయల బియ్యం సంపాదించుకుంటే
రెండు పూట్లకు కడుపు నిండుతుంది
గాలిలో నీకు చెయ్యూపడం కన్నా
నోట్లోకి ఆ చేతి నాలుగువేళ్ళూ
వెళ్ళడం ముఖ్యం కదన్నా
అంచేత క్షమించు
ఇక నిన్ను రైలెక్కించడానికి రాలేను.

*

(1.3.88)

[ఆంధ్రప్రభ దినపత్రిక ప్రచురణ 13.3.88]

# సముద్రం

సముద్రం ఎన్ని కళ్ళ కన్నీళ్ళు తుడిచిందో
ఉప్పులేనిదే రుచిలేదని
జీవితమంత రుచిగా మారిందో !

విషాదానందాలనేవీ దాచుకోక సముద్రం
తెరలు తెరలుగా అలలుగా
నిండుగా అనుభూతి లోతులతో
ఇసుక తిన్నెలవెంట జోరుగా దొర్లుతూంటుంది

సముద్రం పాడుతుంది
పౌర్ణమిరాత్రి వెన్నెలపోతై
ఒంటరి గుండెల మాటై
గంభీరతకు, అవ్యక్త బడబాగ్నులకు దీటై
సముద్రం గొంతెత్తి
నిశ్శబ్దమంత విస్తీర్ణంలో నినదిస్తూంటుంది

ఇసుకతిన్నెలు కంటిరెప్పల్లా
పొడిబారుతున్న తడితో వుంటాయి
పాటపొంగినప్పుడల్లా
తిన్నె ఆర్ద్రమవుతూంటుంది

పొడిఇసుకలో ఓ అనుభూతిక్షణాన్ని పుల్లలాగుచ్చి
దాన్ని వెదుకులాడుతూ
గెలుస్తూ, ఓడుతూ, ఆడుతూంటుంది స్నేహం
వెన్నెల స్నానాలను ఒక తంత్రిమీదా
ఛిద్ర హృదయ రసాలను ఒక తీగె మీదా
ఒక్కొక్కసారిగా కూర్చుకుంటూ
ఏక్‌తారామీద
ఎవడికివాడు క్షణాలను మీటుతూ వుంటాడు
జ్ఞాపకాల పడవలతో
గతజలధిని దాటుతూ వుంటాడు
అందని ఏదో ఆనందపు అక్షరం
అనంతం పలక మీద
రేపటి ఆకారాన్ని వేసుకుంటూంటుంది

సముద్రం నవ్వుతూంటుంది
నురగలతో ముసిముసి విసురుతూంటుంది
శ్రావ్యంగా అనల్పార్థంలో పలుకుతూంటుంది
సముద్రం గుండెగుప్పిట్లో ఉన్నట్లే ఉంటుంది

సముద్రం శిరస్నానపు జాల్చిలానే ఉంటుంది
సముద్రం ఎగిసిపడే కెరటంలా ఉంటుంది
సముద్రం కన్నీరంత ఉప్పగా ఉంటుంది
సముద్రం నవ్వంత నురగగా ఉంటుంది
సముద్రం ప్రేమ అంత విశాలంగా ఉంటుంది
సముద్రం కరుణ అంత లోతుగా ఉంటుంది
సముద్రం పాటలగొంతంత గంభీరంగా ఉంటుంది

సముద్రం స్నేహమంత నీలంగా ఉంటుంది
సముద్రం మృత్యువంత దూరంగా ఉంటుంది
సముద్రం జీవితంలా ఉంటుంది
సముద్రం జీవిస్తుంది
సముద్రమై సముద్రం సముద్రిస్తుంది

•

(21.3.1984)

[ఆంధ్రప్రభ దినపత్రిక ప్రచురణ 22.7.84]

# అమ్మమ్మ చెప్పని కథ

అమ్మమ్మా !
జీవితం నువ్వు చెప్పిన కథలా
కమ్మగా, అందంగా ఉండదని నువ్వేనా చెప్పావు కాదు
చెప్పా పెట్టకుండా నువ్వూ ఓ కథలా
జీవితం నుండి వెళిపోయావు
వెర్రివెధవలా, పిచ్చిసన్నాసిలా
బేలగా భవిష్యత్తు
ఇంకా మిడిగుడ్లేసుకుని నా ముందే ఉంది
పేదరాశిపెద్దమ్మ దయావారాశి ఇంకిపోయింది
నూలువడికే చందమామలోని అవ్వ
మటుమాయమయ్యింది

కాణీలు, బఠానీలు
తాతయ్యగారి కొట్లో పారాడిన బాల్యం
కొండపల్లి వారివీధిలో పొద్దున్నే కొబ్బరిపచ్చడితో ఇడ్లీ
ఎండాకాలం మధ్యాహ్నం గోళీసోడా
బట్టల అప్పారావు కొట్లోతీసిన చొక్కానిక్కర్లూ
బావిపక్క కరివేపాకు చెట్టుకింద
తొట్టిపక్క చప్టాదగ్గర సాయంత్రపు స్నానాలూ

గుడ్డతో వడగడుతూ ఇత్తడిగ్లాసులో కాఫీ
వెన్న కాచిన తరువాత మూకుడు అడుగున గోకుడు
మిరియపుపొడితో జున్నూ
రాత్రిలాంతర్లదగ్గర కాళ్ళుచాపుకు విన్న కథలూ, కబుర్లూ
వంటింటి గడపే తలగడగా
మధ్యాహ్నం నీ మాగన్నునిద్రా
చీమచిటుక్కుమంటే లేచే తాతగారికి
గోడపట్టుకుని కాళ్ళు తొక్కడం
విసనకర్రతో విసరడం, తరుచు విసగడం
అమ్మమ్మా!
ఓ జ్ఞాపకాల భరిణమాత్రం మిగిల్చి
నీ హంస ఎగిరిపోయింది

నిష్కల్మషంగా, గాఢంగా, మూగగా, ముగ్ధగా
చేతులు మొగిడ్చి ప్రార్థించడం
చిన్నతనపు చిన్నతనంగా మిగలడం
జీవితపు పరుగుకాక మరేమిటి!

రైలు కిటికీలోంచి వేగంగా వెనక్కి పరిగెత్తే టెలిగ్రాఫ్ తీగలా
కాలం దాటిపోతూనే వుంది
ఒక్కొక్కరే తమ మజిలీలోకి తెరమరుగవుతున్నారు
తాతగారివెంట — నీవూ క్షణం ఆలస్యం..
పిలుపు అందుకుని వెళ్ళిపోయావంతే

వార్తకూడా ఇంకా కొందరికి అందకుండానే
అంతా ఒక జ్ఞాపకంగా, స్మృతిబిందువుగా, గతధూళిగా
కాలంకేళిగా పరివర్తనం చెందింది

అమ్మమ్మా !
కాలానికీ దూరానికీ నేలకీ నింగికీ అందకుండా
ఒక అనుభూతి ప్రపంచంలోకి వెళ్ళిపోయావు కదా
అదెందుకు నువ్వు చెప్పలేని కథ
ఎలా మిగిలిపోయిందో కదా !

మృత్యుస్పర్శలోనే జీవితం చివరిపంక్తి పేర్చుకుంటుంది
మనుగడకు ఓ శీర్షిక ముగింపే పెట్టుకుంటుంది
కనబడని కథ ఎక్కడో మొదలై వుంటుంది
నీతివాక్యాలు లోకానికి పేరుస్తూవుంటుంది
అయినా అంతా మామూలే !

అమ్మమ్మా !
వర్షం కళ్ళను వదలదు, హర్షం పెదవులకు ఆగదు
చిట్లించే నొసళ్ళూ, చిత్రించే వేళ్ళ పెన్సిళ్ళూ
గుండెలో దిగుళ్ళూ, ప్రేమలో పగుళ్ళూ
బ్రతుకు కాన్వాస్ విస్తారంగానే వుంటుంది
నాడి కుంచెలా కొట్టుకుంటూంటుంది
క్షణాలు రంగుమార్చుకుంటుంటాయి
తీసుకుపోయే దీపం వచ్చేదాకా
చీకటి చిమ్ముతూనే వుంటుంది
ఘర్షణ కుమ్ముతూనే వుంటుంది

పడక, లేవడం—పడవ, మునగడం
పడతి, భ్రమియడం—ప్రగతి సాగడం
అంతా యథావిధే
అలవాటైపోయే కథే

కానీ అమ్మమ్మా !
కథ నువ్వు చెప్పినంత కమ్మగా, అందంగా లేదు
నిన్ను తప్పు పట్టడంలేదు—
ఈ కరకు చేదు జీవితం అనే అపవాదు
విన్నంత కన్నంత తెలియవచ్చినంత కథ కావడమే
జీవితం
నువ్వు కథ చెబుతూ కథ చాలించావు
అమ్మమ్మా !
నువ్వొక ద్రష్టగా చలించావు

మేం వున్నాం—
ఇంకా విప్పని ఓ పొడుపు కథలా
పొద్దుపొడుపు లేని వ్యధలా
దర్భపై సుధలా

*

(24.6.1984)

[స్రవంతి మాసపత్రిక ప్రచురణ డిసెంబర్ '84]

# నువ్వు

పాలూ, కన్నీరూ కలిసిన ప్రాణశక్తివి నువ్వు
ఆదిని పిండుకుని అంతాన్ని మిగిల్చే దోపిడీ శక్తి వాడు
భూమిని తవ్వి బయటకు తీసిన ఇనుమునుండి
తయారైన సంకెలకు మనిషి కట్టుబడినట్లే
నీనుండి ఉద్భవించిన శక్తికే
నువ్వు బానిస వవుతున్నావు

వాడు నిన్ను రాత్రినిచేసి
నీ ముఖాన్ని చందమామ అంటాడు
అమృతాన్ని కొల్లగొట్టి మచ్చనీకు మిగిల్చి వెడతాడు
లేదా
అందాలనీ, ఆకర్షణలనీ బులిపించి
నీ ఆలోచనల స్వేచ్ఛాపక్షాలను నరికి
ఆచారాల కట్టుబాట్ల బలమైన ఊచలతో చేసిన
పంజరంలో నిన్ను వుంచి ఆడించడం
మచ్చిక చేసుకున్న పశువులా పాలించడం వాడికిష్టం

నీ బుద్ధిని నువ్వు పదునుపెట్టనంతకాలం
నీ ఆలోచనల్ని వివేచించనంతకాలం
నీ గుండెల్లో ముడుచుకున్న పిరికిని పెరకనంతకాలం

నీ మీద ఉక్కుపాదం, ఇనుప పిడికిలి
భయోద్విగ్నంగా నర్తిస్తూనే వుంటాయి
నీ హృదయం స్వేచ్ఛలో వికసించిన మరుక్షణం
అన్ని ఊచలూ ఫటాలుమని తెగిపడి
ఒక్కొక్కటీ ఒక శరమై
నీ ప్రతిబంధకాలను తెగనరుకుతాయి
నీ నుదుటినుండే ఒక నవాలోకనా సూర్యోదయం
ప్రభవిస్తుంది
భవితను శాసిస్తుంది

*

(16.1.1985)

[మహిళావాణి మాసపత్రిక ప్రచురణ మార్చి '85]

# కలల బేహారికి

నువ్వు స్వప్నాలని అల్లుతుంటావు
బస్సుల్లో, ఆఫీసు తీరికల్లో, బెడ్‌రూం నిరీక్షణల్లో
రంగురంగుల ఊహల ఊలుదారపు ఉండల్ని ముందేసుకుని
కవిత్వం పొడుగూతా ముందుకాలాన్ని
ఎంబ్రాయిడరీ చేస్తూంటావు

నీ భుజాలమీద పావురాళ్ళు ముక్కుతో పొడుస్తుంటాయి
పెరట్లో నెమలి పురివేసుకుని ఆరుస్తూంటుంది
ఏ యూకలిప్టస్ అడవుల్లోనో
ప్రేయసి ద్రాక్షగుత్తులతో ఎదురు చూస్తూంటుంది

నువ్వు కలలు కనడం మానవు
పావురాలు ఎగరవు - నీ భుజవైశాల్యాన్ని దాటలేని స్వేచ్ఛతో
మబ్బుపట్టిన ఆకాశం కురవదు, నెమలి డుబ్బుల్లోనే వుంటుంది
నీ అడవుల్ని సుగంధాల నూనెలకోసం పిండేస్తూంటావు
స్వెట్టర్లు అల్లుకునే సూదులు తప్ప ప్రేయసికేమీ మిగలవు
నిరీక్షణ కళ్ళల్లోనే అంటుకుపోయి వుంటుంది
అందంగా అలంకరించిన గది
నలగని సినిమా సెట్టింగ్‌లా వుంటుంది

పొడుగైన అంగరఖాతో, వంకీలు తిరిగిన క్రాఫ్‌ల సైన్యంతో
అక్షరాల బంతుల్ని సర్కస్ ఫీట్లతో ఎగరేస్తూ

ఎర్రటి చిలకముక్కుతో నువ్వు నవ్విస్తూనే వుంటావు
కవిత్వాన్ని హోలీరంగులా వెదజల్లుతుంటావు
పట్టు పీతాంబరాల పవిత్రతతో నీకు చుట్టూ ఏదీ కనబడదు
వెన్నెల మేడమీద వున్న నీకు
గుడిసె అర్భకింగానే అనుతుంది
కలల బేహారివి నీకు కన్నీటి ముత్యాలు చవగ్గానే వుంటాయి
గులాబీ అత్తర్లు అద్దుకున్న నీకు చెమట ఆనదు
అది కూడా నీకు అందంగా అలదుకునే
పరిమళంలానే తోస్తుంది
గజకర్ణ గోకర్ణ టక్కుటమారాల ఇంద్రజాలంతో
నువ్వు పాతే టెంక
మామిడిచెట్టయి పళ్ళు పండడం హరితవిప్లవం కాదు
దాంతో ఆకలి తీరదు.

ఓ స్వాప్నిక మహారాజా!
పూలబాణాలతో శత్రు సంహారం కాదు జరిగేది
తామర తంపరల శత్రుజనన పరంపరే
నీ అంతఃపురంలోనే కూచుని వందిమాగధుల్ని
వార్తాహరుల్ని చేసుకుంటే
గృహదహనాలు భోగిమంటలుగా
అసహాయ కన్నెల ఆక్రందనలు వలపుతీపులుగా
అస్పృశ్యతా ధోరణులు నేలాబండా దొంగాటలుగా
ఉత్పత్తిశక్తుల అణచివేత తొక్కుడుబిళ్ళ కేళిగా
మంచుపల్లకీలు పూలపాన్పులుగానే వినిపిస్తాయి, కనిపిస్తాయి
క్షమించు
ద్రాక్షసారాలో ఉదయిస్తున్న ఉషస్సారా!

నీతో నాకు చాలా పేచీ వుంది
యుగాలనుంచీ నా కళ్ళ కన్నీళ్ళు కనబడకుండా
నువ్వు కలల్ని కుక్కుతూనే వున్నావు
ఆకలేసి కేకలేసినప్పుడల్లా నెమిళ్ళ నాట్యాలు చూపించి
శాంతిపావురాలను ఎగరేస్తూ
వెండిగిన్నెలో ముద్దలను గోరుమీద
అందంగా ప్రదర్శిస్తూనే వున్నావు
నా గొంతులోకి దుఃఖాన్ని తప్ప దిగమింగిందేమీ లేదు

నా మీద అందమైన పాటలు రాస్తూనే వున్నావు
నా కండలు కొండలన్నావు, నా గుండె సూర్యుడన్నావు
నా స్వేద బిందువులు సింధువులన్నావు
కొండల్లో డైనమేట్లు పేల్చి నీ ఇళ్ళస్థలాలకు
చదును చేయిస్తావు
గుండెమీద వెన్నెల దుప్పటి కప్పి మత్తుపాట వినిపిస్తావు
ప్లాస్టిక్ స్ట్రాలతో - స్వేదాన్ని రుధిరంతో కాక్‌టైల్ చేసి
మృదువుగా నాలిక చివళ్ళ నుంచి చప్పరిస్తావు

నీతో నాకు చాలా ఆరోపణలున్నాయి
నా పక్షాన వున్నానని చెప్పి నీవు కారుస్తున్న
ముసలి మొసలి కన్నీటిని
ఇవాళ నా కళ్ళసెగ ఆవిరిచేసి
ఊదిపారేయా లనుకుంటోంది
నువ్వు అమ్ముతున్న కలల కడగండ్లు
బచ్చాగాళ్ళ రంగు రంగుల గోళీలు
నీ వైపే వాటిని సరదాగా మొట్టికాయలుగా

విసిరేస్తాడు అర్భకుడు
నువ్వింకా ఈ బజారులో
నీ గతకాలపు కీర్తి కిరీటాలనుచూపి
అధికారం చెలాయించగలననుకోకు
నీ వలపుపొట్లాలు, ఊహల ఊలుదారపు ఉండలు
ఇంక చెలామణికి రావు
ప్రేగులు తెంపి వీణ వాయిస్తున్న ఆర్తి మాది
నీ పాట మాకు స్ఫూర్తికాదు

జీవన సమరంలో క్షతగాత్రులైన సైనికులగాథల్ని
కళ్ళంటూవుంటే చూసి, చెవులంటూ వుంటే విని
అక్కడ నిలబడు
నువ్వు వర్ణించిన మా చరణ కమలాలు
వర్తమాన పంకంలోంచి లేచి నడచి
ఎర్రటినేల నాలుక నిండా కలల పాటలు కాక
దుర్మతిపై కానున్న రణాన్ని
మ్రోగించనున్న విజయ దుందుభిని
గీతాయుధంగా నిలిపి ఎలాసాగనున్నాయో చూడు
రాజుకట్టిన కోట రాణిమెట్టినతోట
సామాన్యులకు పట్టంకట్టి
శ్రమైక జీవన సౌభాగ్యాన్ని స్థాపించగలమ చూడు

ఓ కలల బేహారీ! ఇంక దయచేయ్
జీవన సమరంలోంచి రాలిన రక్తబిందువు నుంచి పుట్టిన
కొత్తయుగం దూతలు అరుగో
ఎదురేగి స్వాగతం చెబుదాం
చెంపలేసుకుని చేవవుంటే నేలమీదకి దిగు

*

(5.3.1982)

[స్రవంతి మాసపత్రిక ప్రచురణ ఆగస్టు '82]

# విన్నపం

జ్వాలా
ఆరిపోకు
నీ కర్తవ్యం తీరలేదు
చీకట్లు దాటడానికి
నువ్వు వెలుగివ్వడంతోనే
పూర్తికాలేదు నీ బాధ్యత
వేగంగా పరుగెత్తడంలో
దారిలో మేం పారేసుకున్నవి
అమూల్యమైనవి ఉన్నాయి కొన్ని
నీ ఆసరాతోనే వాటినీ తెచ్చుకోవాలి మేము

అగ్నికీలా ఆరిపోకు
అమూల్య సంపదలున్న అడవుల్ని
కాలుస్తామంటున్న వారికి
కొరివి పెట్టక తప్పేలా లేదు
మా గుండె ఆశయాల యజ్ఞవాటికలో
పవిత్రమైన నిన్ను
త్యాగాల హవిస్సు వేల్చయినా
ఇంకా ప్రజ్వలింప చేసుకోవలసిందే మేము

ఉద్యమమా
నువ్వు చల్లారడానికి వీలులేదు
నీ పవిత్ర హస్తాలకింద
మమ్మల్ని ఆశీర్వదించు
ఉజ్జ్వల జ్వాలాపథంలో నడిపించు

*

(24.8.1977)

[జయశ్రీ మాసపత్రిక ప్రచురణ అక్టోబర్' 77]

# జీవితం

కమ్మని కలలదిండు కాదు జీవితం
కంటకాలతో కూడిన కాలిబాట జీవితం
జీవితం పడక కాదు
జీవితం నడక.

చైతన్యపు చెంగలింపు కాదు జీవితం
తరుగులేని తమోనభం జీవితం
పడకపై దిండును కరుచుకుని
నరాల చైతన్యపు చెంగలింపు క్రీడే జీవితమన్నట్లు
ఏమిటీ మత్తుమందు సుఖడోల?
తమస్సే కంటకాలుగా విచ్చుకుని
ఎదపొరల్లో గుచ్చుకుని
నిరాశకు ఫీఠాం పడుతుంది
ఈ సుఖడోల తెగిపోయిన రోజు

ద్వివిధా ప్రవృత్తమైన జీవితాన్ని
ఒక కోణం నుంచే చూడకు మరి
నిమ్నోన్నతాలను రెండింటినీ
ఆలోచనల గ్రాఫ్ కాగితంలో గుర్తుపెట్టుకుని
ప్రగతి నిర్దేశకత్వం చూడు

పడుక్కుని నడవకు
నడచినడచి గమ్యం కొసనే పడుక్కో

కుందేలువు కాకు
తాబేలువైనా ఫరవాలేదు
మూపున పగలని ఆశయాన్ని రక్షణగా అమర్చుకుని
పరుగుపందెంలో ఏకాగ్రతలో
హఠం వేసిన కమఠంలా బ్రతుకు
మధ్యేమార్గంలో మభ్యపెట్టే పూలపొదల్లో దాగకు
ముళ్ళల్లో నడిచి పళ్ళల్లో తేలు
నటిస్తే బాధితం
నడిస్తే జీవితం

*

(26.10.1973)

[ఆంధ్ర సచిత్ర వారపత్రిక ప్రచురణ 25.10.74]

# ప్రతి మార్పూ
# సూర్యుడిగానే ఉదయిస్తుంది

ఆదర్శాలుకాక ఆదర్శమూర్తుల నామభజనంతో
ఆశయాలుకాక ఆశయసాధకుల పటాల పూజలతో
నిస్తేజమైన జాతిలో
ఆవేశపు ఆరాధనలు, నినాదాల నీరాజనాలు తప్ప
ఏముంటాయని ? ఏమున్నాయని ?

అవసరాల సరాలు కూర్చి మెడలు వాల్చి
అసందర్భ వాగ్విన్యాసంలో కాలాన్ని కూల్చి
అడుగువేసేవాడికి అవరోధాలు కూరుస్తూ
చైతన్య జ్వాలా తోరణాలు కట్టి, మెదళ్ళ బూజులు దులిపి
వివేకం వెలుగులు ప్రసారం చేసేవాడికి అడ్డంకులు పేరుస్తూ
ఎర్రటి ప్రభాతానికి స్వార్థపు చీకటికాటుక పులమాలని
సృజనాత్మక పిలుపులు లేకుండా గొంతు నులమాలని
జనతావాహినికి అడ్డుకట్ట కట్టాలని
పిరికితనం ఏలుబడిలో ప్రతిక్షణం ప్రయత్నం

ఇనుపగొలుసులు, అద్దపు ఊచలు, పటాలాలు, టపాకులు
మార్పుకు చేయెత్తి ఆహ్వానం పలుకలేని భయం నిట్టూర్పులు

మార్పు తెస్తాననే వాడికి తెలియకుండానే మార్పు వస్తుంది
స్థైర్యం, అవకాశం లేకుంటే అతనిలోనే మార్పు వస్తుంది
దిగజారిన తనంతో నిట్టూర్పు వస్తుంది

తనలోని మార్పును గమనించలేనివాడు
తన చుట్టూ నిజాన్ని చూడలేడు—చూసినా నమ్మలేడు
అంతటితో ఆగడు—చూసినా సహించలేడు
నిజానికి—సహించక చేసేదేమీ లేదు
ఉదయాలు ఆగవు
తూర్పుకొండ తప్పకుండా ఎర్రబడుతుంది
వేకువ బాకులు చీకటి పొట్టల్లో తప్పకుండా గుచ్చుకుంటాయి
చీకట్లో వెలుగొందిన తారలు చిట్లిపోయి నశిస్తాయి

వెన్నెల గురించే పాడేవాడు, చీకటికి వత్తాసు పలికేవాడు
ఇక చెల్లుబడికి పనికిరాడు
వేడిజవం నింపుకుని అరుణగీతాలు
దిక్కులనిండా పాడుకుంటూ
పరిగెత్తుకు వచ్చేవాడు ఎలానూ వస్తాడు
ఎవడికోసమో ఆగడు, దేనికోసమో దాగడు
చేతకాని ప్రతివాడూ తూర్పుతిరిగి
నమస్కారం పెట్టేసి వెనుతిరిగిపోతాడు
సూర్యనమస్కారాలతో పిరికి చేతులను
ముడివేసేసుకుంటాడు

మహాత్ముల గురించి పాడుకుంటూ
మనిషిని—సాటిమనిషిని,
తనంతైనా తిండీ బట్టా గూడూ దొరకనివాడిని

మరిచిపోయే–నికృష్ట హైన్యంలోంచి
కలం బయటపడాలి, కలకలం ధ్వనించాలి
కలకాల కాంక్షలు భవిష్యత్ జీవితాలవడానికి
మహాప్రపంచ మహోదయానికి నేటి సంఘర్షణా యజ్ఞంలో
నిశ్చయంగా సమిధకావాలి

అగ్నిలో పునీతమై, భీరుత్వం నుండి బయటపడి
గుండెల్లో ఆశయాల కనుగుణమైన ఆచరణ పథాన్ని
నిర్మించుకుని
గూళ్ళుదాటి, ఊళ్ళుదాటి, గుట్టలు దాటి,
గిరులు దాటి, అడవులు దాటి
తేజస్సముద్రాలలో ప్రయాణించి
చైతన్యం మెరుపుల మెట్లమీంచి తూర్పు దిక్కు–కెక్కి
అఖండమైన తెలివెలుగుగా సూర్యునిగా ఉదయించాలి

సూర్యుడిని ఏ జైలూ బంధించదు
సూర్యుడిని ఏ తుపాకీ పేల్చదు
సూర్యుడిని తేరిపార చూడడానికి
ఎవడికీ సాహసమే లేదు, ఎవడికీ సాహసమే రాదు
వాడితోనే కాలం కదుల్తోంది, సృష్టి నడుస్తోంది

సూర్యుడిమీద దండెత్తాలని ధ్వజమెత్తితే
పిడికెడు బూడిద చివరకు ఫలితం
అహింసకు ఆఖరిక్షణాలు వచ్చినప్పుడు
కొత్త జన్మకు తొలి లక్షణం
త్వరితంగా సమాజ గర్భాన చైతన్యం కదలికలు

తల్లి ప్రసవవేదన పడక తప్పదు
తన స్వార్థం బాధతో ఆ క్షణాన గర్భాన్ని అసహ్యించుకున్నా
భరించలేననుకున్నా
భరించి
నవోదయ మూర్తిని ప్రసవించక తప్పదు
ప్రసవించి ప్రవిమలంగా భవిష్యత్తును పెంచక తప్పదు
ప్రతి కూర్పూ రేపు జరిగేదే
ప్రతి చేర్పూ ఉదయంతోనే మొదలౌతుంది
ప్రతిమార్పూ సూర్యుడిగానే ఉదయిస్తుంది

*

(30.9.1974)

[స్రవంతి మాసపత్రిక ప్రచురణ డిసెంబర్ '1974]

# ఎర్రటిబంతి

చరిత్రవెనుక
ఎన్నియుగాల క్రిందనో
ప్రకృతికన్య ఆకాశపు నీలికురుల్లో
వెక్కివెక్కి ఏడ్చి
ఎప్పుడు ఈ అశ్రుసుమ నక్షత్రాలు పొదగబడ్డాయో

ఇవాళ్టికీ
నా ఆర్ద్రనేత్రాల కొసల్లో మెరుస్తూ
ఓదార్పు వెన్నెల వేళ్ళతో, గాలి నిట్టూర్పుతో
నా తలను నిమురుతాయి
అప్పుడు నాకు ధైర్యం.

నా బలహీన ప్రకృతిని కంటిముత్యంగా మార్చి
ఆకాశంవైపు ఆవిరిచేసి కాన్కపెడతాను
నక్షత్రాలూ, చంద్రుడూ అన్నీ కూడబల్కుని
చీకటిలోంచి ప్రయాణం చేసి
నాకు సూర్య ఫలాన్ని చవి చూపిస్తాయి

నాలో రాత్రి కన్నీరుగా కరిగి ధైర్యం తొలి ఉషస్సవుతుంది
ప్రకృతికన్య ఒడిలోంచి లేవగానే
ధైర్యంగా, ఆనందంగా ఆడుకోవడానికి
నాకు ఎర్రటిబంతి.

*

(30.9.1974)

[చేతన వారపత్రిక ప్రచురణ 16.3.1975]

# సంభాషణం

పువ్వులను మాట్లాడమన్నాను
'నువ్వు వికసించ'మని సవాలుగా పలికాయి
వికసనం కన్న
గొప్ప సంభాషణం ఏముంది ?
పువ్వులకు చేతనైనది
నాకు చేతకానిది

తేనెను మాట్లాడమన్నాను
'నువ్వు అందరికీ రుచించ'మన్నాయి
తీయదనం కన్న
గొప్ప సంభాషణం ఏముంది ?
తేనెకు చేతనైనది
నాకు చేత కానిది

నాయకుని జవాబు చెప్పమన్నాను
'నువ్వు నోర్మూసుకో' అన్నాడు
మౌనం కన్నా గొప్ప సంభాషణం ఏముంది ?
నాకు చేతనైనది
వానికి చేతకానిది

*

(8.1.1973)

[ఆంధ్రప్రభ వార పత్రిక ప్రచురణ 23.5.1973]

# ఇన్ వై వే

మీరు చేస్తున్నది మంచిపని
కానీ ఇప్పట్లో నే రాలేను
తెప్ప తగలబెట్టాలో వద్దో నాకు తెలీదు
దాటాలి కనుక
ఏరయితే దాటనీయండి
చీకటంతా అనుభవించనీయండి
అప్పుడు కదా—
వెలుగును చూసి
దానికి కట్టుబడగల్గడం

నేను సమగ్రంగా ఏడిస్తే కదా
నవ్వు గురించి
అది గొప్పదనం దవ్వుల్లో వుందన్న దాన్ని గురించి
నాకు తెలిసేది

మొదట లోతులు తెలుసుకోనీండి నన్ను
ఎత్తుకు చేరుకోవడం తరువాత

అలాకాక
వెలుగులో నవ్వుతూ ఎత్తెక్కి

విప్లవిస్తున్నాననుకొని విర్రవీగుతున్న వేళలో
చీకటిలో ఏడుస్తూ, గోతిలో పడిపోతే ?
మళ్ళీ నన్ను నన్నుగానే
నేను నేనులానే—నిలిచేలా
నన్నెవరు రక్షిస్తారు

ఒకరి మాటకన్నా
అనుభవం చెప్పే మాట బలం
నాకు తెలుసు
ఎందుకంటే
ఎవడిని నమ్మి యాంత్రికంగా అడుగువేసినా
నా ప్రాణం మీదా నాకే కదా తీపి
నా ఆత్మశక్తేకద నాకు రక్ష
నీవు వాస్తవమే చెప్పచ్చు
కానీ నాకు వాస్తవంలోకి రావాలి

స్వయంగా నా వివేచనతో చేరితేనేగదా
ఉద్యమం పట్ల నా నిబద్ధత
అది చేర్చే గమ్యంవైపు నాకు దీక్ష
నేను నా మార్గం నుండి మరలను
నిజమైన గమ్యం మీదే అయితే
నా మార్గమే అటువైపు వుండవచ్చు
ఇప్పుడూ ఎప్పుడూ
ఇవాళ్టి మీ దమ్ము మెచ్చుకుంటున్నాను
వాదమ్ము లెందుకు

నాకు మాత్రం నిజంగానే
వేదనలోనే పుట్టనీయండి
వేదాలు—నాదాలు—స్వరాలు—భాస్వరాలు
ప్లవాలు—విప్లవాలు
మీరు చేస్తున్నది మంచిపని
కానీ ఇప్పట్లో నే రాలేను—రాను
తెప్ప తగులబెట్టాలో వద్దో నాకు తెలీదు
దాటాలి కనుక
ఏరయితే దాటనీయండి—దాటుతాను
లెట్ మీ ప్రొసీడ్ ఇన్ మై వే
ఐవిల్ ప్రొసీడ్ ఇన్ మై వే

•

(11.2.1972)

[విశ్వరచన మాసపత్రిక జూన్ 1972]

# అప్పుడు

తిరుపతికి వెడుతున్నామంటూ
పళ్ళెంలో దేవుడితో
ఒకరు మీ భక్తిని సవాలు చేసి
డబ్బులు దండుకుంటారు
అప్పుడేమీ అనిపించదు

తమ పర్సులో నల్లగా వెలిగే డబ్బుతో
ఒకరు మీ ఆశను సవాల్జేసి
పనులు చేయించుకుంటారు
అప్పుడేమీ అనిపించదు

మీ గుటకలేసే గొంతు దాహాన్ని
బొడ్డుకు జానెడు క్రింది ప్రకోపాన్ని
మదిరతో మగువతో సవాలు చేసి
ఒకరు మిమ్మల్ని ముంచెత్తుతారు
అప్పుడేమీ అనిపించదు

ఆశయంవైపు తమ లక్ష్యాన్ని ప్రయుక్తం
చేసుకునేందుకు
ఒహరు మీ కొమ్ముకాస్తున్న భజంత్రీగాడినెవడినో

బంధించి సవాలుచేస్తే
అప్పుడు మీరెందుకో తెగ వొణుకుతారు
మీ అస్థిత్వంలోని అసంబద్ధత వికృతంగా పెరిగి
మీవైపే వంగిందని బెదురుతారు
అవ్యవస్థ హేతువు మీరేనని మీకే అర్థమై
ఫల్రశుతి తలుచుకుని బెంబేలెత్తుతారు.

•

(5.1.90)

# కుదరదు

మాటల్ని దూదిపింజల్లా ఏకి
కోటల పరుపులు కుట్టేవాడు
కందకంలోనే తప్ప
బురుజుల కెగ(బాకలేదు
మబ్బుల అంతరంగాల్ని ఏకి
(దవించి (సవించలేదు
కరుణ కదలి కారే నీరు కన్నీరై
వర్షించలేదు

గులకరాళ్ళ డబ్బా
నిశ్శబ్ద పావురమై ఎగురలేదు
వాగుడుకాయ
ఫలవృక్షంలా సఫలం కాలేదు.
ఆర్భాటాల ఢమఢమలు
సరిగమల సంగీతం పాడలేవు
కొతికొమ్మచ్చి కుప్పిగెంతులు
సరస పదలాస్య భంగిమలు చూపలేవు

అచ్చుయం(తంలా రాసేవాడు
అంతరంగాన్ని స్పందింప చేయలేడు
రంగులేలేని అంతరంగం
రమ్య కవితా రసవర్ణ చి(తం కాలేదు

*

(11.7.1988)

# అద్దపు బిళ్ళలు

రాత్రి
కనురెప్పల కింద కాంతిగోళాలు
మౌనంగా ముడుచుకుని వుంటాయి
సంఘాన్ని, మనుషుల్ని
పొద్దంతా సంఘటనల శకలాలుగా, బొమ్మలుగా
ప్రతిబింబించుకున్న మనసుచేతి అద్దపు బిళ్ళలు
ఒద్దికగా నిద్రిస్తూంటాయి
స్వచ్ఛంగా, స్నిగ్ధంగా

వాతావరణంలోని వేడి, చలువలేకాదు
శకల సంఘటనలలోని
అనుభూతుల రసబిందువులు సైతం
అద్దపుబిళ్ళల్లో కనబడుతూంటాయి
అవి చెమ్మగిలుతాయి, ఎండుతాయి
మండుతాయి, మాటాడుతాయి

ఆకాశం వంగినప్పుడూ, భూమిపొంగినప్పుడూ
మనిషి నాలుగు కాళ్ళమీద
సైకాలజీ సైకిలును తొక్కినప్పుడూ కూడా
అద్దపుబిళ్ళలు మెరుస్తాయి

సన్నని దారపు ఊచల్లా ఆశారేఖలు
అద్దాల అంచుల్లో బిగించబడి వుంటాయి.

చుట్టుకున్నా, ఉండగట్టుకున్నా
పూలు గుచ్చుకున్నా
దారపు ఊచ బలమైంది
గుండె వస్తాదు
ఆ ఊచలు పట్టుకునే వ్యాయామిస్తాడు
అద్దపు బిళ్ళలను కోసే
అనుమానపు దృశ్యాల రాళ్ళుగా అనిపిస్తాయి కొన్ని
కానీ, మృత్యువజ్రం తప్ప
అద్దాలమీద మరేదీ చీకటి దాడి చేయలేదు

క్షణం పొగమబ్బులా, నల్లమరకలా
ఏదో అస్పష్టచిత్రం
అద్దాన్ని ఓ మూల పులిమేయవచ్చు
అయితేనేం మరుక్షణం
మనసుతోటలోని మంచి ముత్యపుచినుకు
అద్దాల్ని కడుగుతుంది
మెరుపును తొడుగుతుంది
విశ్వాసం పొడుగుతుంది
అద్దపుబిళ్ళలు రెండుకళ్ళు,
జీవితం వెలుగుల సూర్యచంద్రులు
*

(15.5.1985)

[ఆంధ్రప్రభ వారపత్రిక ప్రచురణ 3.7.85]

# ఎవరైనా పోతే

అనుభవాల ఊతలిచ్చిన తాతా
అందమైన కథగా జీవితం చెప్పిన అమ్మమ్మా
అనుక్షణం తన ఎదురేకుల మధ్య
తనయుడు తంతున్నా రక్షించి పెంచిన తండ్రీ
వ్యక్తిని వ్యక్తిగా తీర్చిదిద్దేందుకు సహకరించిన ఎందరో
ఒక్కొక్కరే శాశ్వతంగా నిష్క్రమిస్తూంటే
కళలుగానీ, సైన్సుగానీ, చివరకు ఆధ్యాత్మికంగానీ
ఏం చేస్తాయి ?

నిన్ను నీ కాళ్ళమీద నిలబెట్టిందెవరో
నిన్ను అంతంవరకూ ఆరంభంగా బ్రతకమని
అగ్నిభిక్ష పెట్టిందెవరో కూడా నువ్వు విస్మరిస్తావు
ఊపిరున్నంత కాలం
జీవితంనిండా కోరికలను స్మరిస్తావు
తీరని కన్నీటి చారికలను గర్హిస్తావు
ఉప్పొంగుతావ్, గెంతుతావ్, ఉబుకుతావ్
గుడ్డును కోడిని చేయగలవే గానీ
కోడిని గుడ్డుగా మార్చలేవని తెలిసీ పయనిస్తావ్
మృత్యువును జయించలేకపోయినా
ఆ ఊహను జయించాలని తపిస్తావ్

అహంకరిస్తావ్, సాటివారితో కలహిస్తావ్
కలబడతావ్, ద్వేషిస్తావ్, ప్రేమిస్తావ్
చివరకు ఓ క్షణం
చెప్పాపెట్టాకుండా నీకే తెలీకుండా నిష్క్రమిస్తావ్
ఈ నేలపై శతసహస్రాంశ రేణువవుతావ్

మనిషీ : ఇది జీవితం
ఎవరైనా పోయినప్పుడే—కాకూడదు
ఆలోచించే ఎలిజీ గీతం
ఈ జీవితం
ఏ అక్షరాలు రాసి అక్షరమై నిలుస్తావో
నీకే వదలిన తెల్లకాగితం

*

(8.3.1986)

[ఆంధ్రప్రభ వారపత్రిక ప్రచురణ 10.12.86]

# చరిత్రను పఠించు

హిమాలయాల్ని చదువు
హిందూ మహాసముద్రపు లోతుల్ని చదువు
గుప్తరాజుల స్వర్ణయుగాన్ని చదువు
శప్త సమాజ పరిస్థితుల్ని చదువు
కాళిదాసుని చదువు
కోపోద్రిక్త యువకవుల్ని చదువు
నిరుడు కురిసిన హిమసమూహాలు
నేడు విరిసిన అగ్నిసుమదళాలు చదువు
గతాన్ని గుర్తించు
వర్తమానాన్ని అనువర్తించు
భవిష్యత్తును ప్రవర్తించు

చరిత్రను చదవందే
చరిత్రను రాయలేం
చరిత్ర పునరావృత్తం కానక్కరలేదు
ఎంత చక్కనిదయినా
గతమంతా స్వగతం
దర్పణంలో వర్తమానాన్ని చూసుకుని
భవిష్యత్తునొసట ఎర్రటి బొట్టు పెట్టుకోమను
చరిత్ర కన్యను

చరిత్ర

ప్రభువుల ఆనందపు వెలుగేకాదు
పేదల ఆకలిమూలుగు అని కూడా తెలిసినప్పుడు
చీకటి కోణాలలో చిక్కిన కథలను వెలికితీసి
ఆ వ్యధా హేతువులను ఒక కొలిక్కి తెచ్చి
కాంతి ప్రస్తారాన్ని
కారు చీకట్ల దిక్కులలోకి విస్తరించి
తమోమయ లోకాన్ని
జ్యోతిర్గమయం చేయడం వర్తమాన కర్తవ్యం

ఆనందపు స్వర్గాన్ని తమ గుప్పిట పెట్టుకుని
వైయక్తిక దుర్గాన్ని కట్టుకుని
కడగండ్ల కందకాల్లో సామాన్యులను తోసేస్తున్న
ధనిక సామ్రాజ్యవాద వర్గంపై సంఘర్షణతో
చరిత్రను రాయడం కూడా కర్తవ్యం

అందుకే
కళ్ళకు పదును పెట్టుకో
దృష్టిని సాన పెట్టుకో
బుద్ధిని, హృదయాన్ని పీఠం చేసుకుని
దీక్షను తిష్ఠ వేయించు
సమాజపు పుస్తకాన్ని తెరిచి చరిత్రను పఠించు
తారీఖులు, యుద్ధాలుకాక
పరస్పరం సంఘర్షించిన శక్తుల్ని
వర్షించిన శ్రమయుక్తుల్ని
చరిత్రగా పఠించు

పాత రాతియుగం అని నిరసించకు
ఆ పనిముట్లు సైతం అవసరం కావచ్చు

ధనం పాలించే రాజ్యం నుండి
శ్రామిక జనరాజ్యం వైపు పయనించడానికి
ఒక కొత్త ఇంధనం రూపొందించేందుకు
గతం అవలంబనం అయితేనో ?

అందుకే
పఠించు పురాచరిత్ర గాథల్ని
ఆ పురావస్తువుల నాడుల్ని
కొంచెమే కావచ్చు కానీ
గతంలోని మంచిని స్వీకరించు
గతంలోని అనుభవాన్ని గుర్తించు
ఆ పునాదులపై
వర్తమానాన్ని వీక్షించు

కొత్త చరిత్ర రాసేందుకు
పాత చరిత్ర చదివి
కొత్త ఆలోచనలు కావించు
కొత్త మార్గాన్ని అనుసరించు
నీ గమ్యం చేరేందుకు
భవితవ్యాన్ని లక్ష్యం చేసుకుని
ఆచరణమార్గంలో పయనించు
అవును
చరిత్రను పఠించు
చరిత్ర రాద్దాం

(21.9.1980)

[నందిని మాసపత్రిక ప్రచురణ అక్టోబర్ '81]

# నీడలు

ఇవన్నీ నీడలు
తుపాన్ల బీభత్సాన్నీ
తీరపు ప్రశాంతతనూ సంతరించుకుని
అంతరంగస్థలిలో
మానవమేధస్సు సలిపే రకరకాల క్రీడలు

ఒక్కొక్కదానికీ జీవం పోద్దామని
ఆచరణ నద్దుదామని
ఒక్కొక్కదానికీ తలలూ తోకలూ తగిలిద్దామని
నిరంతరం యత్నించే మానవుడికి
తోడునీడలివి
ఇవన్నీ నీడలు—ఇవన్నీ నీడలు

తమ అందాన్ని ఆశల అద్దంలో చూపిస్తూ
ఇవాళ్టి అనుభవాల సంఘటనల సారాలను
రేపుపై-మోజుగా మలచి యిచ్చి
ఈరోజు రాగం వేదనయే అయినా
రేపు తప్పక ఆనందభైరవి పలుకుతుందని
ఊపిరి పోస్తున్నవి కొన్ని

భయపెట్టేవి కొన్ని
సంతోషపెట్టేవి కొన్ని
పసివైనా, ఎవరిపైనో కసితో కూడినవైనా
పిచ్చివైనా, ఎవరికో మనసిచ్చినవైనా
ఎవడికివాడికి ముద్దుగొలిపేవి కొన్ని

ఇవన్నీ నీడలు ఇవన్నీ నీడలు
ఆమెనుండి అతడు ఒంటరిగా వున్నప్పుడు
'పువ్వు వీడిపోయినప్పుడు
పరిమళం నాకు బాధాకరం చెలీ'
అని అతడు ఆవేదన పడేలా
ఆమె నీడను మోసుకొచ్చేవి కొన్ని
అహంకృతులు కొన్ని
ప్రకృతి పరిశీలకులు కొన్ని
రాగులుకొన్ని విరాగులుకొన్ని వేదాంతులుకొన్ని
పట్టించుకోక ఊదని మురళిలోని రాగంలా వుండి
ఏ చిన్నస్పందనకో వాహినిలా ప్రవహించేవి కొన్ని
మరపుల్నీ మధురిమల్నీ కలిగించేవి కొన్ని
ఒక్కొక్కసారి ఉద్రేకంగా
ఒక్కొక్కసారి గలగలపారే సెలయేరులా
మరోమారు మెల్లగా మందాకినిలా సాగిపోయేవి కొన్ని
వర్తమానంలోనే
భూతాన్ని భవితవ్యాన్ని ఇముడ్చుకున్నవి కొన్ని
తరచు కేవలం ఒకే వృత్తం చుట్టూ సంచరించేవి కొన్ని
ఈగల్లా ముసురుకునేవి కొన్ని
జలగల్లా పట్టుకునేవి కొన్ని

జాడ తెలియక గతంగా జారిపోయేవి కొన్ని
బాటలేసుకు భవితలోకి నడచిపోయేవి కొన్ని
ఇవన్నీ నీడలు ఇవన్నీ నీడలు

మనిషి బ్రతికున్నంత కాలం
ఎప్పటికీ ఆరిపోని దీపాలు ఈ నీడలు
ఉచ్ఛ్వాస నిశ్వాసాల సరిగమలు ఈ నీడలు
ఒకప్పుడు నీడల నీరదాల్లోంచి
విద్యుల్లతలు మెరుస్తాయి
మరొకప్పుడు నీడల పరదాల్లోంచి
అశ్రువులు కురుస్తాయి
ఒకప్పుడు నీడలు పీడలై నిలుస్తాయి
కానీ
పూర్తిగా వెలుగులోకి వెళ్ళినా, చీకటిలోకి చేరినా
నీడల జాడలూ పీడలూ వుండవు

నీడకూ - నీ ఎడదకూ మధ్య తెర పల్చటిది
అది గోడకాదు

నీవు దాన్ని కదల్చడం కాదు
నిన్నే అది కదిలిస్తుంది
ఏ రసం ఏ నిష్పత్తిలో అనుభూతిగా తొణకినా
ఏ ఘటన ఏ బరువులో గాలియై తాకినా
తెర తొలగుతుంది నీడ కదులుతుంది

ఇవన్నీ నీడలు
తుఫాన్ల బీభత్సాన్నీ, తీరపు ప్రశాంతతనూ
జమలికలుగా సంతరించుకుని

అంతరంగస్థలిలో మానవమేధస్సు సలిపే
రకరకాల క్రీడలు
ఇవన్నీ నీడలు ఇవన్నీ నీడలు

మన ఆలోచనలే నీడలు
నీడలేని మనిషి లేడు
నీడరాని మనిషి లేడు
నీడ పడని మనిషి లేడు
నీడ తెగినవాడు మృతుడు

*

(3.2.1971)

['వేకువ' త్రైమాసిక ప్రచురణ జూలై-సెప్టెంబర్ 1971]

# అర్ధరాత్రి మేల్కొన్నవాడు

అర్ధరాత్రి మేల్కొన్నవాడు
అందరికంటే భిన్నుడవుతున్నాడు

పగళ్ళలో, దాచుకున్న దిగుళ్ళలో
పగిలిన గుండెను
పదిలంగా పరుచుకుని
ఆశనూ, కన్నీళ్ళనూ రంగరించుకుని
అతికించుకుందామని
అర్ధరాత్రి మేల్కొన్నవాడు
అందరికంటే భిన్నుడవుతున్నాడు

సారాన్ని వడగట్టలేని సంసారాన్ని
దాని జంజాటాన్ని వదలి
యుగాల వెనుక తనను తాను పారేసుకున్న జ్ఞాపకం
హఠాత్తుగా మేల్కొని
అర్ధరాత్రి చీకట్లో
అడుగుల చప్పుడు చేయకుండా
తనను తాను వెదుక్కోడానికి

అడవులవెంట పరిగెత్తడానికి
బుద్ధుడై
అర్ధరాత్రి మేల్కొన్నవాడు
అందరికంటే భిన్నుడౌతున్నాడు

జనంలో కలిసిపోయి
జనం కోసమే వెలిసిపోయి
జనాన్ని ధనానికై గుప్పిట్లో పిండే జనంమీద
తిరగబడి
శ్రామిక జనరాజ్యం తేవాలని,
కొండల్లో పడిపోయిన
చైతన్యం సూర్యుడిని
తూర్పు గుండెమీద పెట్టి
కిరణశక్తి ప్రసరిద్దామని
గిరులుదాటి, ఝరులుదాటి
అడవులు, గుట్టలు దాటి
అహరహమూ జీవితాన్ని
కత్తి అంచుమీద పెట్టి
జనగణమన వేదికపై
జాగృత గీతాలాపకుడై
అర్ధరాత్రి మేల్కొన్నవాడు
అందరికంటే భిన్నుడౌతున్నాడు

పదవిని, పెదవిని కరిచే
అధికారం, కామం పశువును చేయగా
అడ్డంగా పొర్లిపొర్లి

అవినీతి బురదలో దొర్లిదొర్లి
మేల్కొన్న వారిని గూర్చిన స్పృహతో
భయంతో బెంబేలెత్తి
అర్ధరాత్రి మేల్కొన్నవాడు
అసహాయంగా ఖిన్నుడౌతున్నాడు
అందరికీ భిన్నుడౌతున్నాడు
వేకువ బాకులు దూసుకోగా
శకలాలు శకలాలుగా విచ్ఛిన్నుడౌతున్నాడు

*

(20.1.1978)

# నీటిలోంచే నిప్పు

నీ కళ్ళముందే వరదలు
ముంపువచ్చి జీవితాన్ని నిలువునా ముంచేస్తుంటే
నిస్సహాయంగా ఉండిపోతావు నువ్వు
ఎటువైపునుండీ ఏ సహాయమూ అందదు
నీ వాళ్ళనుకున్నవాళ్ళు సైతం
నీ నుండి దూరంగా కొట్టుకుపోతూంటారు
తుఫానుకు నువ్వే కారణమైనట్లుగా మనసంతా ఈదురుగాలి
మాటల్లోతప్ప చేతల్లో నీకేమీ దొరకదు
ఊహల్లోతప్ప ఉనికిలో నీకంతా శూన్యం

ఇల్లనీ ఇల్లాలనీ పుత్రుడనీ నీ తాపత్రయం అంతానీదే
ఎవరిసౌఖ్యం వారిది
సౌఖ్యాలు పంచడం నీ బాధ్యతకానీ ఆశించడం నీ హక్కుకాదు
నువ్వు వరదలో మునిగిపోయినా
నీ వాళ్ళకు సౌఖ్యాన్ని, వాళ్ళకో పునరావాసాన్నీ దొరకనీ
జీవితంలో అనుక్షణపు మనుగడే
బాధల గండిపడిన గోదావరియై బ్రతుకును ముంచెత్తుతూంటే
నిత్య వరదబాధితుడికి ఇంక వరదుడెవ్వడు ?

నీ కన్నీటిని నువ్వే తోడుకో నీ ఎలిజీ నువ్వే పాడుకో
లేదూ— వరదలోంచి అగ్నిలోకి కొట్టుకుపో
అడవిమంటల్లో సెగవై రగిలిపో
నీటిలో కన్నీటిలో బ్రతికేకన్నా అడవిలో అగ్నిలో బ్రతుకు
*

(29.9.1986)

# మృత్యువు

మృత్యువు స్వేచ్ఛగా రాదు
చెప్పాపెట్టకుండా జన్మిస్తుంది మృత్యువు
గాలిలో, నీటిలో, నేలలో
ఎక్కడో అదాటున కన్ను తెరుస్తుంది
పాటల పెట్టెలోంచి ప్రేలిన మందుగుండులా
కార్కె కెళ్ళినవాళ్ళ కన్నీళ్ళకు కూడా పోలికపట్టలేనంతగా
అట్లాంటికాలో రాలిపడిన
కనిష్క విమానపతన దుర్ఘటనంలా
మానవతాఛాయలకు మైళ్ళకుమైళ్ళకు అవలగా
ఎక్కడపడితే అక్కడ
ఎవరిదగ్గరపడితే వారిదగ్గర
పావురాయి పాపల్లోంచి
నూదంటురాయి యువతలోంచి
బరువురాయి వృద్ధాప్యంలోంచి
వావీవరుసలు కూడా చూసుకోకుండా
ఏ క్షణానో అదాటుగా పైకెక్కేస్తుంది మృత్యువు
స్వేచ్ఛగా రాని మృత్యువుకు
అజ్ఞాతంగా వుండి విరుచుకుపడే మృత్యువుకు
ఆహ్వానించి పురెక్కించే ఏజెంట్లుంటారు దేశంలో

దేవుడు కాదు - భయపెట్టేది పూజారి అన్నట్లు
మృత్యువుకన్నా మృత్యువు ఏజెంట్లతోనే మరీ చావు

బ్రిగ్గర్లమీద వేళ్ళతో
కార్బైడ్ కంపెనీ లీకేజి గొట్టాలతో
పట్టాలు తప్పే రైళ్ళతో
గాలిలోంచి గిరికీలుకొట్టి కూలిపడే విమానాలతో
లారీలతో, బస్సులతో
క్యాన్సర్‌లా, గుండెపోటులా—
ఎప్పుడో హఠాత్తుగా, ఊహకయినా అందనట్లుగా
అకాలీనంగా, వయోభేద రాహిత్యంగా
దేహంలో, దేశంలో మృత్యువు చాటుగావుండి
సూటిగా వస్తుంది—పిలవబడుతూంటుంది

ఎవరిచ్చారీ హక్కు దీనికి?
పాపం! మృత్యువు రాకున్నా లేకున్నా
దేహంలో, దేశంలో దాని ఏజెంట్లు మాత్రం
మృత్యుభీతిని అనుక్షణం పరివ్యాప్తం చేస్తూంటారు
రక్తపిపాసులు మృత్యువుకు ఉగ్గుపోస్తుంటారు
రకరకాల ఆకృతుల్లో మస్తాబులు చేస్తుంటారు
మృత్యువుకు దాక్షిణ్యం లేదు
ఎవరిమీదకో తనను ఆక్రమించమని ఆహ్వానించినవాడినే
అరక్షణంలో కౌగిలించేయన్నా

అనుక్షణం మృత్యుభయాన్ని విరజిమ్ముతూ
గాలినీ, నీటినీ, నేలనూ, కలుషితం చేస్తున్న


వాతావరణంలోని విషక్రిముల్ని
అనైక్యతను, అశాంతిని, హింసను కల్పిస్తూ
వ్యవస్థను రోగగ్రస్తం చేస్తున్న బాక్టీరియాలను
సంస్కరణల ప్రయోగశాలలో
తగినట్లుగా ప్రక్షాళనం చేయాలి
స్వాతంత్ర్యానికి నిర్వచనం
తాను సుఖంగా జీవిస్తూ సాటివారిని సుఖంగా జీవింపచేయడం

మృత్యువు స్వేచ్ఛగా రాదు
నిజమే!
కానీ సుఖంగా, సౌభాగ్యంగా, శాంతిగా
జీవించలేని వాతావరణంతో
వ్యవస్థలో స్వేచ్ఛగా జీవించలేకపోవడమే మృత్యువు
అది మన ఉమ్మడి శత్రువు

*

(27.7.1985)

[ఆంధ్రప్రభ వార పత్రిక ప్రచురణ ఆగస్టు 85]



## సుధామ

కవిగా, రచయితగా, సమీక్షకునిగా, కార్టూనిస్టుగా, కాలమిస్టుగా, వక్తగా, రేడియో'వాడి'గా-తెలుగు పాఠకులకు, శ్రోతలకు తెలుసు.

పుట్టింది–1951లో. అసలు పేరు- అల్లంరాజు వెంకటరావు ఉస్మానియా యూనివర్సిటీ ప్రాచ్యవిద్య చదివి – తెలుగులో పోస్టు గ్రాడ్యుయేషన్. 'అభ్యుదయ కవిత్వంలో ఇమేజరీ' గురించి యం.ఫిల్. పరిశోధన చేశారు.

కొంతకాలంపాటు ఉస్మానియా విశ్వవిద్యాలయ విద్యార్థి రచయితల సంఘం కార్యదర్శిగా, యువభారతి ఉపాధ్యక్షులుగా వున్నారు. 1975 నుండి రెండేళ్ళపాటు కరీంనగర్ బిషప్ సాలమన్ జూనియర్ కళాశాలలో తెలుగు లెక్చరర్. 1978 నుండి వృత్తి—ఆకాశవాణిలో. 1983లో జాతీయ కవిసమ్మేళనంలో తెలుగుకవిగా పాల్గొన్నారు. వివిధసంస్థల కవితా సంకలనాల్లో, కేంద్ర సాహిత్య అకాడమీ 'తెలుగు కవిత'లో, 1974లో వెలువడిన 'మేం' కవితా సంకలనం ఇద్దరు కవుల్లో—ఒకరు.

సుధామ తొలి కవితా సంపుటి ఈ—అగ్నిసుధ